ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

వార్త
శనివారం 22, ఆగస్టు 2026 16 పేజీలు



# సమరానికి విద్యుత్ ఉద్యోగులు సన్నద్ధం

ఈనెల 26 లోపు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

పెండింగ్‌లో ఉన్న 14 ప్రధాన సమస్యలు

ఈనెల 27 నుంచి రిలే దీక్షలు చేపట్టేందుకు నిర్ణయం

2వ పేజీలో...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్తు ఉద్యోగులు సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఎంతో కాలంగా ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించకపోవడంతో ఆందోళన కార్యాచరణ రూపొందించారు. అత్యవసర సర్వీసు అయినందున ప్రభుత్వము స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు దిగితే ఇబ్బందులు తప్పవు. ఈ క్రమంలో ప్రభుత్వము విద్యుత్ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి ఆందోళన కార్యక్రమాలు ప్రారంభించక ముందే సమస్యలు పరిష్కరిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

ఈనెల 19న హైదరాబాదులో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది ఉద్యోగులు మహా ధర్నాకు తరలివచ్చారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈనెల 26 లోపు 14 ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 27 నుంచి రిలే దీక్షలు చేపట్టాలని మహా ధర్నా సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. దీంతో విద్యుత్ ఉద్యోగులు సమరానికి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాలలో విద్యుత్ ఉద్యోగులు విలువైన సేవలను అందిస్తున్నారు. అత్యవసర సర్వీస్ కావడంతో నిరంతరము ప్రజలకు



# ఇంటింటా వరలక్ష్మీ వ్రతం

## ఆలయాల్లో భక్తుల సందడి




అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ..

ముత్తైదువులకు వాయనాలు

శ్రావణ శోభ.. వరలక్ష్మీ వ్రతంతో కళకళలాడిన ఆలయాలు

ఖమ్మం, ఆగస్టు 21 (ప్రభాతవార్త కల్చరల్):

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఖమ్మం నగరంలోని వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరాలు ప్రసాదించే వరలక్ష్మీదేవిని కొలు స్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచ రించారు. ఉదయం నుంచే ఆలయా లకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరా వడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఇంటింటా భక్తి సందడి..

శ్రావణమాసంలో అత్యంత విశిష్టమై నదిగా భావించే వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు తమ ఇళ్లలో సంప్రదాయబద్ధంగా నిర్వహిం చారు. అమ్మవారి ప్రతిమలు, చిత్ర పటాలను పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక

# భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

నీటిపారుదల ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు

పరిహారం, పునరావాస ప్రక్రియలను సత్వరం పూర్తి చేయాలి

కొత్తగూడెం, ఆగష్టు 21 ప్రభాతవార్త

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో



16లో...

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అంకిత్ →



16లో...

# వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి

పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం, ఆగష్టు 21 ప్రభాతవార్త

పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు

# సమరానికి విద్యుత్ ఉద్యోగుల సన్నద్ధం

### మొదటి పేజీ తరువాయి..

అందుబాటులో ఉండి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వము వారి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు సంబంధించిన 14 సమస్యలను పరిష్కరించాలని వాటిపై చర్చించేందుకు సమావేశాలు నిర్వహించాలని కొంతకాలంగా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆందోళన కార్యాచరణ రూపొందించారు. వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్తు శాఖలోని కీలకమైన విభాగాలలో పొరుగు సేవల ఉద్యోగులను తీసుకోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. పొరుగు సేవల ఉద్యోగులతో ప్లాంట్ భద్రత దీర్ఘకాలిక పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఉద్యోగ సంఘాల నాయకులు మహాధర్నా సందర్భంగా పేర్కొన్నారు. ఆర్టిజన్లకు, క్యాడర్ సీనియారిటీ, ప్రమోషన్, సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు. 1999-2004 మధ్యకాలంలో నియామకమైన ఉద్యోగులకు జిపిఎఫ్, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని కోరుతున్నారు. సిబ్బంది కొరత లేకుండా చూసేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 26 లోపు ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే 27 నుంచి అన్ని జిల్లాలలో రిలే దీక్షలను చేపట్టేందుకు విద్యుత్తు ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సిద్ధమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ ఉద్యోగుల అవసరం ఎంతగానో ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాలలో విద్యుత్ వాడకం పెరిగింది. కొత్తగా కనెక్షన్లు తీసుకుంటున్నారు. పంటల సాగుకు రైతులు వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు దరఖాస్తులు చేసుకొని బోర్లు, బావులకు మీటర్లను ఏర్పాటు చేయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు దిగితే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వం స్పందించి సానుకూలంగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తే విద్యుత్ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా పోతుంది. ఇప్పటికే సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలో గ్రామ పంచాయతీ వర్కర్లు ఆందోళనలు చేపట్టారు. ఉద్యోగ జేఏసీ నాయకులు సమరానికి సన్నద్ధమవుతున్నారు. వీరి బాటలోనే విద్యుత్ ఉద్యోగులు కూడా ఈనెల 27 నుంచి రిలే దీక్షలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆర్టీసీ కార్మికులు కూడా సమ్మె చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఈనెల 25 నుంచి ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే వివిధ శాఖల ఉద్యోగులు పోరుబాట పట్టే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి. వెంటనే ప్రభుత్వం చొరవ చూపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడం విజయానికి తొలిమెట్టు

### -సీఐ ఎల్.పవన్ కుమార్

**మరిపెడ, ఆగస్టు 21, ప్రభాతవార్త:**



విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడం విజయానికి తొలిమెట్టు అని మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ అన్నారు. మరిపెడలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కాలేజీ, పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, నైతిక ప్రవర్తనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పవన్ కుమార్, ఎస్ఐ గంద్రాతి సతీష్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇటీవల చోటుచేసుకున్న నేర ఘటనలను ఉదాహరణగా వివరిస్తూ, నేర ప్రవృత్తికి దారితీసే కారణాలను వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ మంచి నడవడికతో ముందుకు సాగాలని సూచించారు. భారతదేశంలో యువత అధికంగా ఉందని, నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుత ప్రవర్తనతో విద్యలోనూ, జీవితంలోనూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్, వైస్ ప్రిన్సిపాల్ రాజకుమార్, పీఈటీ బాలు మహేంద్ర పాల్గొన్నారు.

# కొమరంభీమ్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**బయ్యారం, ప్రభాతవార్త, ఆగస్టు 21:**



బయ్యారం మండలం కొత్తపేట గంధంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొమరం భీమ్ కాలనీ ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇప్పటికే కొమరం భీమ్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేసి బోరు మోటార్ ఫిట్టింగ్ పనులు పూర్తి చేశామని, ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు, సుమారు రూ.20 లక్షల నిధులతో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం మరో రూ.10 లక్షల నిధులతో చర్చి నుంచి పుల్లయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, దశలవారీగా కొమరం భీమ్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో మట్టి రోడ్ల లేకుండా ప్రతి ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు అందిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్యకి పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అధ్యక్షుడు కారుబోతుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ రావి వీరభద్రరావు, దానసరి వీరభద్రం, ముత్తక్క, రామ్మూర్తి, సాంబశివరావు, చల్లా సురేష్, పసుపులేటి సతీష్, రాసమల్ల మహేష్, బోడ సాయి, ఈసం స్వరూప, పెనుగొండ పుల్లయ్య, భూక్యా బాలకృష్ణ, వద్దే ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు దొంగలు రిమాండ్

### -సీఐ రవీందర్

**బయ్యారం, ప్రభాతవార్త, ఆగస్టు 21:**



బయ్యారం మండలంలో జల్సాలకు అలవాటు పడ్డ నలుగురు యువకులు ఒక ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలకు పూనుకున్నారు. వివరాల్లోకి వెళితే ఇస్లావత్ అశోక్, కొత్తగడ్డ సాంబశివ రావు, భూపాసింగ్ ఇటుకలు చోరిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రశాంత్ బాబు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. వాహన తనిఖీలు చేస్తుండగా ఇటుక లోడ్ తో వస్తున్న ట్రాక్టర్ పై నలుగురు వ్యక్తులు తారసపడ్డారు. ఇటుక గురించి వివరాలు అడిగితే సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నామలపాడుకు చెందిన పూనెం సతీష్, సువర్ణపాక సతీష్, సనప సుధాకర్, మోకాళ్ళ మహేష్ గా తెలిపారు. వారిని విచారించగా వివిధ ఇటుక బట్టీలలో యాజమానుల అనుమతి లేకుండా సుమారు 4 వేల మట్టి ఇటుకలు, 200 సిమెంట్ ఇటుకలు దొంగలించినట్లుగా ఒప్పుకున్నారు. వాటి విలువ సుమారు 40వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరణ అనంతరం నలుగురిని రిమాండ్‌కి తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. చోరికి ఉపయోగించిన 2 ట్రాక్టర్లు, 2 బైక్ లను సీజ్ చేసి, దొంగల వద్దనుండి 15 వేల రూపాయలు రికవరీ చేసినట్లు తెలిపారు. చోరీలు అరికట్టడానికి ఎస్పి ఆదేశాలతో, డిఎస్పి సూచనలతో రాత్రి వేళలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని తెలియజేశారు. చోరీ కేసు చేదించిన ఎస్ఐ ప్రశాంత్ బాబు, పాపారావు, మోహన్, సారంగపాణి, సుబ్రమణ్యంను సీఐ అభినందించారు.

# భూ నిర్వాసిత బాధితులకు నష్టపరిహారం

### -ఆరు సంవత్సరాల సిపిఎం పోరాట ఫలితం

**గార్ల, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగా ఇటీవల నష్టపరిహారం విడుదల చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న 36మంది భూనిర్వాసిత రైతులకు ఆరు సంవత్సరాలుగా చెల్లించాల్సిన నష్టపరిహారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో అనేక దఫాలుగా జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, గార్ల తహసీల్దార్ కార్యాలయాలలో ఆందోళనలు నిర్వహించి, గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు తెలిపారు. కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపరిహారం రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు, బాధితులకు అండగా నిలిచి పోరాటం చేసిన సిపిఎం, రైతు సంఘాల మండల కమిటీలు, సిపిఎం బుద్ధారం శాఖకు భూ నిర్వాసిత బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# జీవో 97ను రద్దు చేయాలి

### -డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వివేక్

**మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్న జీవో నెంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని, జీవో నెంబర్ 97పై ప్రభుత్వం వెంటనే పునరాలోచించి దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మానుకోట గడ్డ నుంచే మహాప్రస్థానం ఉద్యమానికి శ్రీకారం చుడతామని విద్యార్థుల హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, జీవో నెంబర్ 97ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ లక్ష్మణ్ నాయక్, డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్, కోశాధికారి గుగులోతు సూర్య ప్రకాష్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత, డిఎస్ఎఫ్ఐ నాయకులు దేవేందర్, జవహర్, రమేష్, శివ వర్మ, కేసముద్రం నాయకులు అభిరామ్, షోయబ్, శ్రవణ్, సురభి సాయి, విఘ్నేష్, గౌతమ్, నవదీప్, రాకేష్, సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# దుప్పట్లు పంపిణీ చేసిన బయ్యారం సర్పంచ్

**బయ్యారం, ప్రభాతవార్త, ఆగస్టు 21:**



బయ్యారం మండల కేంద్రంలోని పాస్టర్ ప్రభాకర్ కూతురి జ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బయ్యారం గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ చేతులమీదుగా సుమారు 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిషప్ ప్రభాకర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలనుండి కరెంట్ లేక ఇబ్బంది పడుతున్నా సమయంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకొని కరెంటుస్తంభాలు ఏర్పాటు చేపించిన సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. బయ్యారం ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా, బయ్యారం మాజీ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వర రావు, తాటి జనార్ధన్, పులి మల్లయ్య, నందిపాటి బవాణి, ఆకునూరి సూర్యనారాయణ, రామగిరి వెంకటేశ్వర్లు, తుపాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఘన నివాళి

**గార్ల, ఆగస్టు 21, ప్రభాతవార్త:**

అనారోగ్యానికి గురై గత నాలుగు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొంది మరణించిన మండల కేంద్రానికి చెందిన తోటి పూర్వ విద్యార్థిని దువ్వ ఉమారాణి తల్లి దువ్వ చిలకమ్మకి పదవ తరగతి 1993-94పూర్వ విద్యార్థులు ఘనంగా నివాళ్ళు అర్పించారు. మరణ వార్త తెలుసుకొని మిత్ర బృందం మండల కేంద్రంలోని సహచర విద్యార్థిని గృహాన్ని సందర్శించి మృతదేహానికి పూలమాలు వేసి శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈసందర్భంగా కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేసి అధైర్య పడొద్దని ధైర్యంగా ఉండాలని మనోధైర్యం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కత్తి రామకృష్ణ, జంగం వేణు, షేక్ సలీం, మేడి రమేష్, వీరబత్తిని రాము, తాళ్లూరి కొండల్, జింకరవి, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



వైరా టౌన్ ఆగస్టు 21 (ప్రభాతవార్త)

స్టేజి పినపాక గ్రామంలో శ్రీ కోదండ రామచంద్ర స్వామి వారి దేవాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ, శ్రీ కోదండ రామచంద్ర స్వామి వారి దేవాలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ. 40 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ తుమ్మలపల్లి కృష్ణారావు, మాజీ సర్పంచ్ దేనువకొండ పుల్లం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, మాజీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ జిల్లా జనరల్ సెక్రెటరీ దొడ్డ పుల్లయ్య, డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెళ్ళూరి వీరయ్య, కోసూరి శ్రీను, చెరుకూరి కిరణ్, కట్ట వెంకటేశ్వరరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దేనువకొండ శివరాజు, బుడుగేం దాసు, దేనువకొండ కొండల్ రాజు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మహిళలు శ్రావణ శుక్రవారం వ్రత పూజలు

వైరా టౌన్ ఆగస్టు 21 (ప్రభాతవార్త)

వైరా మండలాల్లో శ్రావణమాసం రెండు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడం వలన మహిళలు తమ తమ ఇంటిలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 4 గంటల నుండి ఇల్లంతా శుభ్ర చేసి అమ్మవారిని అలంకరించి పిండి వంటలతో వంటలు చేసి పూజా కార్యక్రమం నిర్వహించి వరలక్ష్మి వ్రత కథ విధానాన్ని అర్చకులు వారికి వివరించారు. వరలక్ష్మీ వ్రతం అంటే ఆచార్యులు వివరిస్తూ శ్రావణ మాసం అంటేనే ఆధ్యాత్మికతకు, పూజలకు, వ్రతాలకు, మంగళకరమైన ఆచారాలకు విశిష్టమైన మాసం. ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడం సనాతన సంప్రదాయంలో విశిష్టమైన ఆచారంగా కొనసాగుతోందిని మహిళలు ఈ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.వర్త అంటే శ్రేష్ఠమైనది, వరాలను ప్రసాదించేది అనే భావం.



అందువల్ల వరలక్ష్మీ అనగా భక్తులకు శ్రేష్ఠమైన వరాలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మీ స్వరూపం. శ్రీ వరలక్ష్మీదేవిని భక్తితో ఆరాధించడం ద్వారా సౌభాగ్యం, ఆయురారోగ్యం, సంతానం, ఐశ్వర్యం, ధనధాన్య సమృద్ధి, కుటుంబ శ్రేయస్సు, సుఖశాంతులు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. వరలక్ష్మీ వ్రతం ప్రధానంగా ముత్తయిదువులు తమ కుటుంబ సౌభాగ్యం, భర్త ఆయురారోగ్యం, సంతానాభివృద్ధి, కుటుంబ క్షేమం కోసం భక్తిశ్రద్ధలతో ఆచరించే పవిత్రమైన వ్రతంగా ప్రసిద్ధి చెందింది. ఈ వ్రతాన్ని ముత్తయిదువులు ప్రత్యేకంగా ఆచరించే సంప్రదాయం ఉంది. వరలక్ష్మీ వ్రతానికి సంబంధించిన సంప్రదాయ కథనంలో పార్వతీదేవి – పరమేశ్వరుల సంవాదం, అలాగే చారుమతి వ్రతకథకు ప్రముఖ స్థానం ఉందిఅని .స్కంద పురాణ సంప్రదాయం ప్రకారం పార్వతీదేవి స్త్రీలకు శ్రేయస్సును కలిగించే వ్రతం గురించి పరమశివుని అడగగా, శ్రీ వరలక్ష్మీ వ్రత విధానాన్ని శివుడు వివరించి, చారుమతి కథను చెప్పినట్లు పేర్కొనబడింది అని అర్చకులు తెలిపారు. చారుమతికి శ్రీ మహాలక్ష్మీదేవి స్వప్నంలో దర్శనమిచ్చి వరలక్ష్మీ రూపంలో తనను ఆరాధించమని అనుగ్రహించినట్లు ఆ కథనం వివరిస్తుంది. చారుమతి భక్తిశ్రద్ధలను చూసి ఇతర స్త్రీలు కూడా ఆమెతో కలిసి వ్రతాన్ని ఆచరించినట్లు సాంప్రదాయం చెబుతుందని అర్చకులు తెలిపారు. అనంతరం ముత్తైదువులకు వాయనం ఇచ్చి పుచ్చుకున్నారు.

# ఖరీఫ్ వరి సాగు శ్రేయస్కరం కాదు

అశ్వాపురం, ప్రభాతవార్త, ఆగస్టు 21:

ఎల్‌నినో ప్రభావం వలన వర్షపాతం సరిగా లేక ఈ సంవత్సరం ఖరీఫ్ సాగు ఇప్పటికే చాలా ఆలస్యమైందని, ఇక పై ఖరీఫ్ వరి సాగు శ్రేయస్కరం కాదని కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం శాస్త్రవేత్త టి. భరత్ అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి చటర్జీ తో కలిసి మొండికుంటలోని రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగు ఆశాజనకం



కాదని, రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. తక్కువ కాలం ఆరుతడి పంటలు సాగు చేసుకోవటం వల్ల రబీ వరి సాగుకు సంసిద్ధులు కావచ్చని ఆయన పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి చటర్జీ మాట్లాడుతూ రైతులు భూములు బీడు పెట్టవద్దని, ఆరుతడి పంటలు సాగు చెయ్యాలని, ప్రభుత్వం ద్వారా పంట సర్వే మొదలయిందని, సాగులో ఉంటేనే ప్రభుత్వం అందించే వ్యవసాయ సంబంధిత పథకాలు అందుతాయని సూచించారు. అనంతరం బోరు నీటి ఆధారిత రైతుల వరి పైరును పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెంకటాపురం లో ఎంపీడీవో పర్యటన.

అశ్వాపురం, ప్రభాతవార్త, ఆగస్టు 21:

వెంకటాపురం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని అశ్వాపురం ఎంపీడీవో ముత్యాలరావు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను, పారిశుద్ధ్య కార్యక్రమాలను, త్రాగునీటి వ్యవస్థ సంబంధిత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడకమూలమ్మ వెంకటాపురం గ్రామ పంచాయతీ మంజూరైన నూతన పంచాయతీ కార్యాలయం అసంపూర్తిగా నిలిచిందని. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించే దృష్ట్యా కార్యాలయాన్ని తొందరగా నిర్మించాలని, కాంట్రాక్టు పనులను దక్కించుకున్న గుత్తేదారు నిర్లక్ష్యంతో పనులను చేయట్లేదని, వేరే గుత్తేదారుకు ఎవరికైనా అవకాశం ఇచ్చి పంచాయతీ



కార్యాలయాన్ని త్వరగా పూర్తి చేయవలసిందిగా ఎంపీడీవో ముత్యాలరావును కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధానికి నడుం బిగించిన గ్రామస్తులు

నిడమనూరు ప్రభాతవార్త ఆగష్టు 21

మండలంలోని ముప్పారం గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ అల్లం రోజా ఆధ్వర్యంలో పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి యువత మరియు గ్రామ ప్రజలు ఆరోగ్యరీత్యా మధ్యాహ్నం పై పూర్తిగా నిషేధించాలని పాలకవర్గం తీర్మానించింది. సెప్టెంబర్ ఒకటవ తారీఖు నుండి ముప్పారం గ్రామంలో మద్యం విక్రయించిన వారిపై గ్రామపంచాయతీ పాలకవర్గం 50,000/ రూపాయలు జరిమానా విధించడమే కాకుండా మరియు ఎక్సైజ్ పోలీస్ డిపార్ట్మెంట్ వారు చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునని తీర్మానం చేయడం జరిగింది. ముప్పారం బెల్టు షాపుల నిర్వాహకులు, యువకులు, గ్రామ పెద్దలు పార్టీలకు అతీతంగా అందరూ తీర్మానించారు.

# నేరాలు-దారుణాలు

## ఇనుప సువ్వల దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు..



.ఏన్కూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త

:ఏన్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోజరిగిన ఇనుప సువ్వల దొంగతనం కేసును పోలీసులు ఛేదించి..ఇద్దరు నిందితు ల ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దొంగిలించిన ఇనుప సువ్వల ముక్కలు మరియు వాటి రవాణాకు ఉపయో గించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి..ఏన్కూరు మండలంలోని నా చారం గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న వంతెన (బ్రిడ్జి) వద్ద ఇనుప సువ్వలు దొంగిలించబడినట్లు ఈ నెల19వ తే దీన ఫిర్యాదు అందింది. దీనిపై ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా..శుక్రవారం ఆగస్టు 21వ తేదీన దొంగిలించిన ఇనుప సువ్వలను..ఆటోలో తరలిస్తున్న ఇద్దరు నిందితుల ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని చింతల సాయి గణేష్ (22), బేతాళపాడు గ్రామం..మరియు కిల్లి వెంకటేష్ (25), ఇబ్రహీంబాదు గ్రామం.. శ్రీకాకుళం జిల్లా వాసులుగా గుర్తించారు. నిందితుల వద్ద నుంచి సుమారు 5 0 కిలోల ఇనుప సువ్వల ముక్కలను..అలాగే వాటి రవాణాకు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చే సుకున్నారు. విచారణలో నాచారం బ్రిడ్జి వద్ద నుంచి ఇనుప సువ్వలను దొంగిలించినట్లు నిందితులు అంగీకరించి నట్లు పోలీసులు తెలిపారు. కల్లూరు సబ్ డివిజన్ ఏసీపీ వసుంధర యాదవ్, ఆధ్వర్యంలో ఏన్కూరు పోలీసులు కేసును విజయవంతంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి త దుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## సత్రం బజారుకు మరమ్మత్తులు

వైరా టౌన్ ఆగస్టు 21 (ప్రభాతవార్త)



వైరా మున్సిపాలిటీ పరిధిలోని వర్షాల కారణంగా సత్రం బజారులో ఉన్న రోడ్లను 12..13 వార్డ్ లో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తులు కంకరపోయుటకు సిద్ధం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు సిబ్బంది కలిసి పర్యవేక్షించారు. మున్సిపల్ ఏఈ పలు సూచనలు తో సత్రం బజార్ నుండి కె వి సి ఎం కాలేజీ వరకు ఎక్కడ గుంతలు ఉన్న కంకర తో నింపాలని ఆమె సూచించారు. బురద మయంతో ఉన్న రోడ్లను ప్రత్యేక శ్రద్ధతో మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ పరిశీలించటం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి.

అశ్వాపురం, ప్రభాతవార్త, ఆగస్టు 21:



పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేటి ఉదయం 10 గంటలకు మణుగూరులో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని అశ్వాపురం బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు యూత్, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు భారీగా తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ఉద్యమమే శరణ్యమని, జీవో 97ను రద్దు చేసే వరకు పోరాడుదామని ఆయన పేర్కొన్నారు.




# యువతకు వృత్తి నైపుణ్యాలే జీవనోపాధికి మార్గం

**భద్రాచలం, ఆగస్టు 21(ప్రభాతవార్త):** పై చదువులు చదివి ఖాళీగా ఉండకుండా ఇష్టమైన వృత్తుల్లో శిక్షణ పొందుతూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ గిరిజన యువతీ యువకులకు సూచించారు. శిక్షణతో పాటు ఆదాయ మార్గాలపై అవగాహన పెంపొంది సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీని సందర్శించిన పీఓ బి.రాహుల్ ఇప్పటివరకు శిక్షణ పొందిన వారు, ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న వారు, రాబోయే బ్యాచ్‌ల వివరాలను సమీక్షించారు. అనంతరం వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న గిరిజన యువతీ యువకులతో మాట్లాడి వారు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. బ్యూటీ థెరపిస్ట్, సీఆర్ఎం, డొమెస్టిక్ నాన్‌వాయిస్, ఎంబ్రాయిడరీ తదితర కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారు శ్రద్ధతో శిక్షణ



తీసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తయిన అనంతరం నైపుణ్యాలను వృథా చేయకుండా వాటిని ఉపాధి, ఆదాయ మార్గాలుగా మలుచుకోవాలని అన్నారు. బ్యూటీ థెరపిస్ట్, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన యువతులు సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సీఆర్ఎం శిక్షణ పొందిన వారు వివిధ సంస్థల్లో పనిచేసేటప్పుడు కస్టమర్లను మర్యాదపూర్వకంగా పలకరిస్తూ, వారికి అవసరమైన సేవలను సమయానుకూలంగా అందించాలని అన్నారు. అప్పుడే శిక్షణకు న్యాయం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. యువతకు శిక్షణ అందిస్తున్న ఫ్యాకల్టీలు సంబంధిత వృత్తుల్లోని ఆధునిక సాంకేతికత, కొత్త పద్ధతులపై కూడా అవగాహన కల్పించాలని పీఓ సూచించారు. ముఖ్యంగా బ్యూటీ థెరపిస్ట్ శిక్షణలో ఆధునిక సాంకేతికతను, నూతన పద్ధతులను చేర్చాలని అన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న యువతీ యువకులు తమ తోటి వారికి కూడా వృత్తి నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించి, వారు కూడా ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని బి.రాహుల్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వైటీసీ మేనేజర్ శ్రీనివాస్, ఫ్యాకల్టీలు అనురాధ, అరుణ, దినకుమార్, రజియా బేగం, రామ్‌ప్రకాష్, సంధ్య, జ్యోతి, సమ్మయ్య, యువతీ యువకులు పాల్గొన్నారు.

## మల్లికార్జున రావు మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులు

**దుమ్ముగూడెం ప్రభాతవార్త (ఆగస్టు 21):**



దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామానికి చెందిన నల్ల మల్లికార్జున రావు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు విషయం తెలుసుకున్న భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం సీతానగరం గ్రామం వెళ్లి మల్లికార్జునరావు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు మల్లికార్జునరావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరారుఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ పార్టీ నాయకులు కార్యకర్తలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మెరుగైన పీఆర్సీ ఇప్పించే బాధ్యత నాది: ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**భద్రాచలం, ప్రభాతవార్త:**




రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ సాధించేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం భద్రాచలంలోని పీఆర్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కొద్ది రోజుల్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ సాధిస్తామని, సీపీఎస్‌ను రద్దు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో పండిట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయించడం, గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ ఇప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇటీవల అకాల మరణం చెందిన బూర్గంపాడు మండల శాఖ అధ్యక్షుడు ఎస్. శంకర్, యుగంధర్ కుటుంబాలకు పీఆర్‌టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసయ్య, ప్రభాకర్‌రావు, కట్టా శేఖర్‌రావు, శంకర్, రాష్ట్ర నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, కారంపూడి దశరథబాబు, పీఆర్‌టీయూ మాసపత్రిక సబ్‌ఎడిటర్ కె.వి. రమణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భాస్కరరావు, సురేష్‌బాబు, నాగులు, వీరరాజు, మంగయ్య, దగ్గుపల్లి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, రామకృష్ణ, మోహన్, ఈశ్వర్, శివ, కళావతి, విజయనిర్మల, ధనలక్ష్మి, కేజియ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు

**దుమ్ముగూడెం ప్రభాతవార్త (ఆగస్టు 21):**



దుమ్ము గూడెం మండలంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు మండలంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో దేవాలయాల్లో పూజలు నిర్వహించారు అనేకమంది తమ గృహాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి మంగళ స్నానం చేయించి నూతన పట్టు వస్త్రములు పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు దేవాలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు అమ్మవారి దేవాలయం తరపున భక్తులకు తాంబూలాలు సమర్పించారు మండలంలోని అనేక గ్రామాల్లో మహిళలు తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి చుట్టుపక్కల ముత్తైదువులకు తాంబూలాలను అందించారు ప్రజలందరూ సుఖ సంతోషాలతో భోగభాగ్యాలతో ఉండేలా దీవించాలని అమ్మవారికి మొక్కుకున్నారు

## వైభవంగా వరలక్ష్మీ వ్రతం..

### భక్తిశ్రద్ధలతో మహిళల పూజలు

### అమ్మవారి అనుగ్రహం కోసం ప్రత్యేక అలంకరణలు..

### వాయినాలతో సందడిగా శ్రావణ శుక్రవారం

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త:** శ్రావణ మాస శుక్రవారం సందర్భంగా కొత్తగూడెం మండల వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా జరిగాయి. మహిళలు తెల్లవారుజామునే తలంటు స్నానాలు ఆచరించి, ఇళ్లను శుభ్రం చేసుకుని పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారిని కొలిచారు. మేదరబస్తిలోని అయిత విజయలక్ష్మీ నివాసంలో వరలక్ష్మీ అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, తాంబూలం, వస్త్రాలతో అమ్మవారిని అలంకరించి దీపారాధన, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. వ్రతం అనంతరం మహిళలు పరస్పరం పసుపు, కుంకుమ, తాంబూలం, పండ్లు, పూలు, వస్త్రాలు తదితరాలను వాయినంగా అందజేసుకున్నారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని వరలక్ష్మీ అమ్మవారిని ప్రార్థించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇళ్లలో ప్రత్యేక పూజలు, మంగళహారతులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడంతో కొత్తగూడెం మండలంలో పండుగ సందడి కనిపించింది.





## మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

**సారపాక, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మహంకాళి రామారావు అధ్యక్షతన బూర్గంపహాడ్ మండలంలోని తాళ్లగొమ్మూరు రైతు వేదికలో శుక్రవారం ఉప సర్పంచ్‌ల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గంపహాడ్ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా బి. మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా తోటమల్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పొదెం సుధాకర్, కోశాధికారిగా పందగ సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఉప సర్పంచ్‌ల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు, వారి హక్కుల సాధన కోసం కృషి చేయాలని, గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్రను



మరింత బలోపేతం చేయాలని నూతన కార్యవర్గానికి పలువురు సూచించారు. ఉప సర్పంచ్‌ల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు నాయకులు, ఉప సర్పంచ్‌లు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెదారి రమేష్, మోడెం రాధాకృష్ణ, కేశవపల్లి బేబి, సున్నం కృష్ణవేణి, చి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బట్టు శివ నాయక్

**పాల్వంచ, ఆగస్టు 21, ప్రభాత వార్త :**



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎస్టీ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాల్వంచకు చెందిన బట్టు శివ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బట్టు శివ నాయక్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు పార్టీ కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ బట్టు శివ నాయక్‌కు అభినందనలు తెలిపారు.

# సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలు సాధించిన 10 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థులు

ఖమ్మం విద్యా విభాగం ఆగస్టు 21, ప్రభాత వార్త : స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అటానమస్) విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సంస్థ ష్యూర్ ఇంటర్నేషనల్ యల్.యల్.సి. సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ అసోసియేట్ ఉద్యోగాలను సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతు మలేషియా, ఒమన్, ఖతార్, భారత్ వంటి వివిధ దేశాలలో విస్తృతంగా వ్యాపిస్తున్న బహుళజాతి సంస్థలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో తమ కళాశాల ఖ్యాతి గడించిందని అభిప్రాయపడ్డారు.

కళాశాలలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ మరియు కోడింగ్ శిక్షణలను సద్వినియోగం చేసుకున్న 10 మంది సి.యస్.ఈ., సి.యస్.యమ్., సి.యస్.డి. విద్యార్థులు సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు



ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. వివిధ దశలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలలో 173 మంది పాల్గొనగా, ఆన్‌లైన్ అసెస్మెంట్, టెక్నికల్ రౌండ్, హెచ్.ఆర్‌లలో చివరకు 10 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులలో వసుమర్తి సాయి అవినాష్ 12 లక్షల వార్షిక ఆధాయాన్ని అందుకోనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వారిలో ఒకరికి 12 లక్షలు, ముగ్గురికి 10 లక్షలు, ఆరుగురికి 6 లక్షల ప్యాకేజీతో వార్షిక ఆధాయాన్ని అందుకోనున్నట్లు కళాశాల వైస్‌చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ఎంపికైన వారికి వారి ఆదాయాన్ని అనుసరించి 24 వేలు, 15 వేలు, 10 వేలు చొప్పున 3 నెలల ఇంటర్న్‌షిప్ స్టైఫండ్ అందుకోనున్నట్లు ప్రకటించారు. ఎంపికైన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ డెవలపర్ అసోసియేట్ హోదాలో తమ వృత్తి జీవితాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థం మరియు ఉద్యోగ సిద్ధత కల్పించడంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ చేస్తున్న కృషికి ఇది ఒక మంచి నిదర్శనమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ష్యూర్ ఇంటర్నేషనల్ యల్.యల్.సి ప్రతినిధులు చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ వివేక్, సీనియర్ హెచ్.ఆర్. పూజలతో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. యన్. సవిత, జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.




## కమాన్ బజార్ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానము నందు వార్షిక పవిత్రోత్సవ మహోత్సవాలు

ప్రభాతవార్త గాంధీ చౌక్ ఆగస్టు 21



ఖమ్మం పట్టణ, కమాన్ బజార్ నందు వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు వార్షిక బ్రహ్మోత్సవములు ఈరోజు నుండి తేదీ: 21082026 నుండి 23082026 వరకు మూడు(3) రోజులు జరుగు వార్షిక పవిత్రోత్సవ సహిత సహస్ర కాలశాభిషేక మహోత్సవములో భాగముగా ఈ రోజు మొదటి రోజున ఉదయం. 09.00 గంటల నుండి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, ఋత్విక్వరణము, రక్షాబంధనము, పారాయణ మూలమంత్రానుష్ఠానములు, బ్రహ్మకళశ పాలికాస్థాపన, పవిత్రాది వాసాలంకారణలతో కార్యక్రమాలు ప్రారంభం అయినవి. ఇట్టి కార్యక్రమములో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి నరసింహారావు, రెనోవేషన్ కమిటీ చైర్మన్ శిరం లక్ష్మీ నరసింహ కృష్ణ ప్రసాద్ గుప్తా మరియు సభ్యులు కమర్తపు కిరణ్ కుమార్, బండారు శ్రీనివాసరావు, కొప్పుల రవి కుమార్, రాయపూడి శిరీష, శ్రీరంగం మాధవ ప్రసాద్, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు. తదుపరి రెండు రోజులు జరిగే పవిత్రోత్సవ కార్యక్రమములో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించ వలసిందిగా ఆలయ ఈవో, సిబ్బంది భక్తులకు మనవి చేశారు.

## దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

### బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం

ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త.



ఖమ్మం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి, ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి చోరీకి గురైన బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం త్రీ టౌన్ సిఐ మోహన్ బాబు తెలిపారు. ఈనెల 12వ తేదీ రాత్రి సుమారు 11.00 గంటల సమయంలో జహీరపుర, గుట్టల బజార్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన నిందితుడు తుడుము గోపి, వయస్సు 28 సంవత్సరాలు, నివాసం గుట్టల బజార్, ఖమ్మం, తాళం పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించాడు. అనంతరం బీరువాను తెరిచి అందులో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును చోరీ చేశాడని తెలిపారు.చోరీ చేసిన సొత్తును విక్రయించేందుకు శుక్రవారం గాంధీచౌక్‌లోని బంగారు షాపుల సముదాయం వద్దకు వచ్చిన సమయంలో, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతడిని వెంబడించి పట్టుకొని విచారించగా, నేరాన్ని అంగీకరించాడని పేర్కొన్నారు.స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు: బంగారు చెవి దిద్దుల జత - 1.20 గ్రాములు బంగారు చెవి బుట్టల జత - 5.05 గ్రాములు వెండి పట్టీల 3 జతలు - 81 గ్రాములు నగదు - రూ.7,000/మొత్తంగా 6.25 గ్రాముల బంగారం, 81 గ్రాముల వెండి మరియు రూ.7,000/ నగదు, సుమారు రూ.1,00,000/ విలువైన చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు.విచారణలో నిందితుడిపై గతంలో ఫోక్సో కేసు మరియు కొట్లాటకు సంబంధించిన కేసులు కూడా నమోదై, అవి కోర్టు విచారణలో ఉన్నట్లు వెల్లడైందని నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు తెలిపారు.




## రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

బయ్యారం,ప్రభాతవార్త,ఆగస్టు21:

బయ్యారం మండలంలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు.ట్రాక్టర్ ఆటో ఢీకొని ఒకరు మృతిచెందారు.మరో ప్రమాదంలో ఇల్లెందు నుంచి బయ్యారం వైపు బైక్ పై వెళ్తున్న ఓ యువకుడిని నామాల పాడు సమీపంలో మరో బైక్ వెనకనుంచి ఢీకొన్న సంఘటనలో హరికృష్ణ తలకు బలమైన గాయాలు కావడంతో మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి తండ్రి బచ్చల వీరస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.మరో ఘటనలో బయ్యారం మండలంలోని కొత్తపేట సమీపంలో మిరపతోట మొక్కలు నాటి కార్మికులు తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామానికి సమీపంలోని వైకుంఠ ధామం మూల మలుపు వద్దకు రాగానే ఇర్సులాపురం నుండి వేగంగా వస్తున్న ట్రాక్టర్ వేగం అదుపు కాకపోవడంతో ఆటోను ఢీకొట్టింది. ఆటోలో వున్న రాసమల్ల మంగమ్మ తలకు ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో మెదడు తీవ్ర గాయం అవ్వడంతో ఆటోలోనే మరణించింది.మృతురాలికి ఒక కూతురు,ఒక కుమారుడు ఉన్నాడు.మృతురాలి కుమారుడు రాసమల్ల అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు కేసు నమోదు చేసి,ట్రాక్టర్ డ్రైవర్ మరికంటి రాకేశ్‌ను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రూపారెడ్డి హత్య ఘటనను తీవ్రంగా ఖండించిన సీపీఐ

మరిపెడ,ఆగస్టు21,ప్రభాతవార్త:

నల్గొండ జిల్లాలో ప్రిన్సిపాల్ రూపా రెడ్డిపై పదో తరగతి విద్యార్థులు దాడి చేసి హత్య చేసిన ఘటనను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ అన్నారు.మరిపెడ మండల కేంద్రంలోని అంగడి ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన వయసులో ఇలాంటి హింసాత్మక ఘటన చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమన్నారు.యువతపై ఆల్కహాల్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల ప్రభావం తీవ్రంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు బానిసలైతే విద్యార్థుల చదువు, ప్రవర్తన, భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు హింసాత్మక ధోరణులు పెరిగే ప్రమాదం ఉందన్నారు.పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, సరఫరాపై కఠిన నిఘా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాల్సిన వయసులో మత్తు పదార్థాలు, హింస ప్రవేశించడం సమాజానికి ప్రమాదకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు, విద్యాశాఖ, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ప్రిన్సిపాల్ రూపా రెడ్డి కుటుంబానికి సీపీఐ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు.

## ఇతరుల వాహనాలను అనధికారికంగా కుదువ పెడితే కఠిన చర్యలు

### ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ

ఖమ్మం క్రై ప్రభాతవార్త

అనధికారికంగా ఇతరుల వాహనాలు కుదువ పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు.ఖమ్మం అర్బన్, బల్లేపల్లికి చెందిన బైతా పార్థు అనే యువకుడి యాజమాన్యంలోని స్విఫ్ట్ కారు, నెం: గళీ18 నీ 8241 ను, గుగులోత్ శ్రీనివాస్.. (పాండురంగాపురం) రెండు రోజుల నిమిత్తం అద్దెకు కావాలని నమ్మించి తీసుకెళ్లాడు. అనంతరం దురుద్దేశంతో సదరు కారును యజమాని అనుమతి లేకుండా మూడ్ అశోక్.. (బార్లగూడెం) వద్ద రూ. 90,000/లకు కుదువ పెట్టాడు. మూడ్ అశోక్ కూడా సదరు కారు పార్థుదని తెలిసి కూడా అక్రమంగా కుదువ పెట్టుకున్నాడు.ఫిర్యాదుదారుడు తన కారును తిరిగి ఇవ్వమని అడగ్గా నిందితులు ఏమార్చుతూ వచ్చారు. ఈ క్రమంలో 10.08.2026 రాత్రి మూడ్ అశోక్ ఆ స్విఫ్ట్ కారు TS18 F 8241 తో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. వాహనాన్ని తిరిగి ఇవ్వమని కోరినందుకు ఫిర్యాదుదారుడిని బెదిరింపులకు గురిచేశారని తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఖమ్మం టూ టౌన్ పోలీసులు త్వరితగతిన విచారణ చేపట్టి, నిందితులపై కేసు నమోదు చేసి స్విఫ్ట్ కారు TS18 F 8241 ను రికవరీ చేశామని తెలిపారు.పోలీసుల హెచ్చరిక !! ప్రజలకు విజ్ఞప్తి: సమాజంలో ఇటీవల కాలంలో ఇతరుల వాహనాలను యజమానులకు తెలియకుండా అద్దెకు తీసుకుని, మూడో వ్యక్తి వద్ద కుదువ పెట్టే ధోరణి పెరుగుతోంది. ఇది తీవ్రమైన నేరం. ఈ సందర్భంగా ప్రజలకు ఖమ్మం టూ టౌన్ పోలీసులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తున్నారు: అనధికారిక లావాదేవీలు నేరం: వాహన యజమాని అనుమతి, సమ్మతి లేకుండా ఇతరుల వద్ద నుండి వాహనాలను కుదువ పెట్టుకోవడం లేదా అప్పుగా తీసుకోవడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. వాహన యజమానుల బాధ్యత: మీరు అనధికారికంగా ఎవరికైనా వాహనం ఇచ్చినప్పుడు, ఆ వాహనం ఏదైనా విద్రోహ చర్యల్లో లేదా నేరాల్లో భాగమైతే, చట్టప్రకారం వాహన యజమాని కూడా జవాబుదారీ కావలసి వస్తుంది.3. కఠిన చర్యలు తప్పవు: అనుమతి లేకుండా వాహనాలు కుదువ పెట్టుకున్న వారిపై, ఇచ్చిన వారిపై మరియు వారికి సహకరించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ బాలకృష్ణ హెచ్చరించారు.




# కాపు సీతాలక్ష్మి నివాసంలో వైభవంగా శ్రీ వరలక్ష్మీ వ్రతం

**శ్రావణ మాస పవిత్రను చాటుతూ**

**భక్తుశ్రద్ధల తో కదిలిన మహిళలు**

**ఇరుగుపొరుగు మహిళలు**

**బంధువులు ఆడపడుచులు సందడి**



**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసంలో శ్రీ వరలక్ష్మీ వ్రత వేడుకలు ఆధ్యాత్మిక శోభతో, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. శ్రావణ మాస పవిత్రతను చాటుతూ భక్తిశ్రద్ధల నడుమ సాగిన ఈ వేడుకలు స్థానికంగా విశేషంగా ఆకట్టుకున్నాయి. విశేష అలంకరణల నడుమ శ్రీ వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ వేడుకకు పెద్ద ఎత్తున హాజరైన ఇరుగుపొరుగు మహిళలు, బంధువులు, ఆడపడుచులు ఒకరికొకరు సాంప్రదాయబద్ధంగా వాయనాలు మార్చుకున్నారు. పుష్పాలు, ఫలాలను కానుకగా ఇస్తూ పండగ వాతావరణాన్ని మరింత రెట్టింపు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సీతాలక్ష్మి ప్రథమ పుత్రుడు జినిత్ ఈశ్వరిలా పుత్రిక మహాలక్ష్మి (గుణద్య) ఆడపడుచులు, ముత్తైదువులు ఆశీర్వదించారు. ఆ చిన్నారి చదువు సంస్కారాలు సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని విచ్చేసిన మహిళలు దీవెనలు అందజేశారు. పూజ అనంతరం విచ్చేసిన భక్తులకు, మహిళలకు వాయినాలు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## లక్ష్మీదేవిపల్లి జీపీశాప్ మోడల్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



లక్ష్మీదేవిపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీశాప్) మోడల్‌ను రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ లో మంత్రి సీతక్క డిజిటల్‌గా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. గ్రామంలోని 29 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర సమగ్ర సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు ఇలాంటి జీపీశాప్ ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లిని మోడల్‌గా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన ఎంపీడీఓ సుస్మిత, ఎంపిఓ, పంచాయతీ కార్యదర్శి సాంబయ్యలను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

## మందుల ఖర్చు తగ్గాలంటే.. జనరిక్ పేర్లతో ప్రిస్క్రిప్షన్లు



**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**

వైద్య చికిత్స కోసం వచ్చే రోగులపై మందుల ఖర్చు భారం తగ్గించేందుకు జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సమగ్ర అభివృద్ధి వేదిక (సావ్) కోరింది. ఈ మేరకు ఐఎంఏ ప్రతినిధులకు వినతిపత్రం అందజేసింది. ప్రిస్క్రిప్షన్లలో బ్రాండెడ్ మందుల పేర్లతో పాటు జనరిక్ పేర్లను స్పష్టంగా పేర్కొనాలని సావ్ ప్రతినిధులు సూచించారు. ముఖ్యంగా దీర్ఘకాలిక చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు మందుల వ్యయం భారంగా మారుతోందని, జనరిక్ మందులు అందుబాటులోకి వస్తే వారికి ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా రోగులకు స్పష్టంగా అర్థమయ్యేలా



చదవగలిగే విధంగా ప్రిస్క్రిప్షన్లు రాయాలని, జనరిక్ ప్రత్యామ్నాయాలు, మందుల ధరలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందుల లభ్యతను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సావ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో మాండవ సుబ్బారావు, బి.జి.ఆర్. వెస్లీ, ఎం. మోహన్‌రావు, తిరుపాల్ తదితరులు ఐఎంఏ నాయకులను కలిసి వినతిపత్రం సమర్పించారు. అంశాలను వైద్యుల దృష్టికి తీసుకెళ్లి సహకరిస్తామని ఐఎంఏ నాయకత్వం హామీ ఇచ్చింది.

## ప్రజల గొంతుకగా.. జనసేనకు బలమైన వాణిగా గడల,

**జనసేన తెలంగాణ అధికార ప్రతినిధిగా నియామకం**

**కొత్తగూడెం, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యలను బలంగా వినిపిస్తూ, జనసేన పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మాజీ హెల్త్ డైరెక్టర్, జనసేన రాష్ట్ర నాయకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు స్వీకరించారు. జనసేన పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధిగా ఆయనను పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించారు. వైద్య రంగంలో తన సేవలతో గుర్తింపు పొందిన గడల శ్రీనివాసరావు.. ఇప్పుడు రాజకీయంగా ప్రజల సమస్యలను ప్రస్తావించే కీలక బాధ్యతను చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో జనసేన పార్టీకి ప్రజల్లో మరింత విస్తృతంగా చేరువయ్యేలా పార్టీ వాణిని స్పష్టంగా వినిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. "బాధ్యత మారవచ్చు.. కానీ నా లక్ష్యం ఒక్కటే.. ప్రజలే ప్రథమం, ప్రజాసేవే పరమావధి" అని గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా సమస్యలపై జనసేన వైఖరిని హుందాగా, స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకురావడంలో అధికార ప్రతినిధిగా తన పాత్రను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. పార్టీకి, ప్రజలకు మధ్య బలమైన వారధిగా నిలుస్తానని స్పష్టం చేశారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరికి, పార్టీ నాయకత్వానికి, జనసైనికులు, వీర మహిళలు, పార్టీ శ్రేణులకు గడల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

## బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను బైండ్ ఓవర్

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**

కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ బార్‌లో ఇటీవల మద్యం మత్తులో కత్తులతో బెదిరింపులకు పాల్పడిన ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, ప్రజల శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చట్టపరమైన చర్యల్లో భాగంగా సంబంధిత ముగ్గురు వ్యక్తులను బైండ్ ఓవర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం 3 టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో ఘర్షణలకు పాల్పడుతూ, కత్తులతో బెదిరింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.




## పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలి ఎంపీడీవో తాళ్లూరి రవి

**జూలూరుపాడు, ప్రభాతవార్త, ఆగస్టు 21:**



వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి రైతు తన పొలంలో పంట కుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సంరక్షించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి కోరారు. మండల కేంద్రమైన జూలూరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలో రైతు సాయిల కృష్ణ ఏర్పాటు చేసుకున్న పంట కుంటను శుక్రవారం ఎంపీడీవో పరిశీలించి, పంట కుంటను ప్రారంభించారు. పంట కుంట ఏర్పాటు చేసుకున్నందుకు రైతు సాయిల్ కృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా పంట కుంట వద్ద ఉన్న కూలీలు, రైతులకు ఎంపీడీవో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులపై అవగాహన కల్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవని పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చే ప్రతి వర్షపు నీటి చుక్కను పొలాల్లో నిల్వ చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పంట కుంటల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవడంతో పాటు భూగర్భ జలాల పెరుగుదలకు కూడా దోహదపడుతుందని వివరించారు. మండలంలోని రైతులందరూ పంట కుంటల ఏర్పాటు వలన అవగాహన పెంచుకోవాలని కోరారు. పంట కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈజీఎస్ ఏపీవో రామారావు, ఎఫ్ఏ భద్రం పాల్గొన్నారు.

## రైతు నాయకుడి మృతికి సంతాపం తెలిపిన కొత్వాల

**పాల్వంచ, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



పాల్వంచ మండల దంతెలబోర గ్రామానికి చెందిన రైతు నాయకులు పోలెబోయిన కన్నయ్య అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం దంతెలబోర లోని ఆయన స్వగృహంలో భౌతిక కాయానికి డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు తో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం రైతాంగానికి తీరని లోటు అని అన్నారు. ఆయన మృతితో దంతెలబోర ప్రాంతం మంచి రైతు నాయకుణ్ణి కోల్పోయిందని కొత్వాల అన్నారు. కన్నయ్య కుమారుడు పోలెబోయిన నందిరాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, గంధం నర్సింహారావు, మాజీ ఎం.పీ.టీ.సి పోలెబోయిన వీరాజు, మాజీ సర్పంచ్ లు తెల్లం మల్లేష్,తెల్లం అలివేలు.. తదితరులు పాల్గొన్నారు. పెద్దమ్మ దేవాలయంలో శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్న లింగంపల్లి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం పాల్వంచ మండలం పరిధిలోని కేశవాపురం గ్రామంలో ఆయన భౌతిక కాయానికి కొత్వాల పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు.

# యువతను విస్మరిస్తే పతనం తప్పదు..

**.. జెన్ జీవి "దిమాగి" నక్సల్స్ గా ప్రకటన మోడీ అసహనానికి నిదర్శనం .**

**..అధ్యయనం పోరాటం అలవర్చుకోవాలి..**

**. యువజన సమాఖ్య జిల్లా మహాసభలో కూనంనేని**

చింతకాని ప్రభాతవార్త ఆగస్టు 21

పాలకులు యువతను విస్మరిస్తే పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం




శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి ఉద్యోగ రంగాలు పొట్టి పోతున్నాయని తద్వారా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఉపాధి లేక యువశక్తి నిర్వీర్యం అవుతుందని ఆయన తెలిపారు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలు శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పగడాల భరత్ ప్రాంగణంలో జరిగింది మహాసభకు ముందు గ్రామంలో వందలాది మంది యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు మహాసభ ప్రారంభ సూచికగా ఏఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు అమరవీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు మహమ్మద్ గౌస్ పాషా ,అబ్బూరి మహేష్ దండి శ్రీజ మామిడి కిరణ్ యమునా అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ యువజన సమాఖ్య కార్యకర్తలు సామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో ముందు వరుసలో




నిలబడాలని సూచించారు దేశ జనాభాలో సగం కలిగిన యువత హక్కుల కోసం పోరాడాలని పోరాడకుండా ఏ హక్కులు సాధించబడలేదన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతరానికి ఉందని అందుకే చైతన్యవంతులైన ఈ తరాన్ని చూసి మోడీ భయపడుతున్నాడని సాంబశివరావు తెలిపారు మోడీ విధానాల కారణంగా యువత తీవ్ర అసహనానికి గురైందని అసహనం నుంచి ఆవేశం వచ్చిందని దీంతో మోడీ తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు. యువతరం ముఖ్యంగా జెన్ జివి వీధుల్లోకి పోరాట మార్గం ఎంచుకోవటంతో మోడీ అహంకారం పై తొలివేటు పడిందన్నారు అందుకే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా,ఖ" దిమాగి నక్సల్స్ " అన్న పదాన్ని తెరపైకి తెచ్చి ప్రశ్నించే వారిని దిమాగి నక్సల్స్ గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందని కూనంనేని తెలిపారు మావోయిస్టులను లేదా కమ్యూనిస్టులను భౌతికంగా హతమార్చిన భావజాలాన్ని మాత్రం అంతమందించడం ఎవరి తరం కాదన్నారు భావజాలాన్ని తుద ముట్టించేందుకు దిమాగి నక్సల్స్ పేరుతో నిర్బంధాలు హతమార్చడం లాంటి చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడగోడుతున్నారని మోడీ కేవలం అంబానీ అదానీ కోసం ప్రధానిగా పనిచేస్తున్నారని కూనంనేని ఆరోపించారు ప్రపంచవ్యాప్తంగా వామపక్ష భావజాలం పెరుగుతుందని పెట్టుబడిదారీ దేశం అమెరికాలో ట్రంప్ కు వ్యతిరేకంగా సోషలిస్టులు వరుస విజయాలు సాధిస్తున్నారని న్యూయార్క్ మేయర్ ను సోషలిస్టు భావజాలం ఉన్న వ్యక్తి గెలుచుకున్నారన్నారు సమాజచోదక శక్తి యువతేనని మారిన మారుతున్న పరిణామాలు నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాట తత్వాన్ని అలవర్చుకోవాలని యువత సైతాంతిక నైతిక శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు పోరాటాల కాణాచి ఏఐవైఎఫ్ వలీ ధర్మేంద్ర భారతదేశ యువజనోద్యమాలకు దిక్సూచి ఏఐవైఎఫ్ అని పోరాటాల కాణాచిగా పేరుగాంచిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలివుల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర తెలిపారు యువజన సమాఖ్య మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు యువతకు సంబంధించిన ఏ పథకాలను అమలు చేయడం



లేదని ఆరోపించారు యువతకు ఉపాధి ఉద్యోగాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని వారు తెలిపారు ఉద్యోగ ఉపాధి కల్పనకు సంబంధించి పాలకులు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడుతామని వలి ధర్మేంద్ర తెలిపారు ఈ మహాసభల్లో సిపిఐ జాతీయ సమితి సభ్యుల భాగం హేమంతరావు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి , కొండపర్తి గోవిందరావు నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానీ మియా ఏపూరిలతాదేవి బిజె క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు కూచిపూడి రవి ఆహ్వాన సంఘం అధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు




## ఔటర్ రింగ్ రోడ్డు భూముల పరిహారం పెంచాలి



మధిర ఆగస్టు 21 ప్రభాతవార్త

మండల పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేసిన భూములకు పరిహారాన్ని పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఇల్లందులపాడు రాయపట్నం గ్రామాలకు చెందిన రైతులు తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ను కలిసి తమ సమస్యపై వివరించారు. పరిహారాన్ని పెంచాలని కోరుతూ వినతిపత్రం అని అందజేశారు. చిన్న సన్నకారు రైతులుగా ఉన్న తమకు జీవనాధారంగా ఉన్న భూమిని అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం సేకరించాలని అన్నారు. మా భూముల మార్కెట్ విలువ సుమారుగా ఎకరం 50 లక్షల నుండి 60 లక్షల వరకు ఉన్నదని, ప్రభుత్వం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తమ పట్ల సానుకూలంగా స్పందించి పరిహారాన్ని పెంచి తమను ఆదుకోవాలని వారు కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు నాయకులు మహాదేవపురం సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వర రావు, బిఆర్ఎస్ నాయకులు రంగశెట్టి కోటేశ్వరరావు, కొఠారి రాఘవ రావురైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## నేడు బీపీ ,షుగర్, వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం

మధిర ఆగస్టు 21 ప్రభాతవార్త

బోడెపుడి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మధిరలోని సిపిఎం పార్టీ కార్యాలయం లో డిపి షుగర్ గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారికి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. నిపుణులైన వైద్యుల సమక్షంలో కేవలం రూ. 100 లకే పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను నెలకు సరిపడా అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే శరత్ మాక్స్ విజన్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించబడును. ఈ వైద్య శిబిరం ఉ. 7 నుండి 9 గం.ల వరకునిర్వహించబడుతుందనీ, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## కొమరంభీమ్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బయ్యారం,ప్రభాతవార్త,ఆగస్టు21:

బయ్యారం మండలం కొత్తపేట గంధంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొమరం భీమ్ కాలనీ ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఇప్పటికే కొమరం భీమ్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేసి బోరు మోటార్ ఫిట్టింగ్ పనులు పూర్తి చేశామని,ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు, సుమారు రూ.20 లక్షల నిధులతో వివిధ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు.

ప్రస్తుతం మరో రూ.10 లక్షల నిధులతో చర్చి నుంచి పుల్లయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, దశలవారీగా కొమరం భీమ్ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామంలో మట్టి రోడ్ల లేకుండా ప్రతి ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు అందిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్యకి పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అధ్యక్షుడు కారుబోతుల రామ్మూర్తి,ఉప సర్పంచ్ రావి వీరభద్రరావు, దానసరి వీరభద్రం,ముత్తక్క,రామ్మూర్తి, సాంబశివరావు,చల్లా సురేష్, పసుపులేటి సతీష్,రాసమల్ల మహేష్,బోడ సాయి,ఈసం స్వరూప, పెనుగొండ పుల్లయ్య,భూక్య బాలకృష్ణ, వడ్డే ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 97ను రద్దు చేయాలి

**-డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు వివేక్**

మహబూబాబాద్ టౌన్,ఆగస్టు21,ప్రభాతవార్త:

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్న జీవో నెంబర్ 97ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం



సరికాదని, జీవో నెంబర్ 97పై ప్రభుత్వం వెంటనే పునరాలోచించి దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మానుకోట గడ్డ నుంచే మహాప్రస్థానం ఉద్యమానికి శ్రీకారం చుడతామని విద్యార్థుల హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు.పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి, జీవో నెంబర్ 97ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోతు హరి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ లక్ష్మణ్ నాయక్,డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయికుమార్, కోశాధికారి గూగులోతు సూర్య ప్రకాష్,మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత, డిఎస్ఎఫ్ఐ నాయకులు దేవేందర్,జవహర్, రమేష్, శివ వర్మ, కేసముద్రం నాయకులు అభిరామ్, షోయబ్, శ్రవణ్,సురభి సాయి,విఘ్నేష్, గౌతమ్, నవదీప్, రాకేష్, సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణి చేసిన బయ్యారం సర్పంచ్

బయ్యారం,ప్రభాతవార్త,ఆగస్టు21:

బయ్యారం మండల కేంద్రంలోని పాస్టర్ ప్రభాకర్ కూతురి జ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లు పంపిణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బయ్యారం గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ చేతులమీదుగా సుమారు 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిషప్ ప్రభాకర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలనుండి కరెంట్ లేక ఇబ్బంది పడుతున్నా సమయంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకొని కరెంటుస్తంబాలు ఏర్పాటు చేపించిన సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

వార్త



# సర్కారు దవాఖానకు కార్పొరేట్ వైద్యం

## ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి

## కొత్తగూడెంలో త్వరలో క్యాథ్ ల్యాబ్

## జీజీహెచ్‌కు రూ. 3 కోట్ల నిధుల మంజూరు



**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త**

నియోజకవర్గ ప్రజలకు అదేవిధంగా జిల్లా ప్రజలకు మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన విశేష కృషి ఎట్టకేలకు ఫలించింది. పేద, మధ్యతరగతి ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులో ఉంచాలనే సంకల్పంతో ఆయన ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చి ప్రత్యేకంగా రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో అత్యాధునిక సౌకర్యాలు సమకూరనున్నాయి. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడే రోగుల ప్రాణాలను కాపాడేందుకు కీలకమైన అధునాతన క్యాథ్ ల్యాబ్ సేవలను ఇక్కడ త్వరలోనే ప్రారంభించనున్నారు. దీంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)ను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పేదలు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా ఆస్పత్రిలోనే అత్యాధునిక ఎంఆర్ఐ స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే రోగుల కోసం అన్ని హంగులతో కూడిన 20 పడకల ఐసీయూ (ఐసీయూ) విభాగాన్ని కూడా నిర్మిస్తున్నారు. గతంలో గుండెపోటు లేదా ఇతర తీవ్రమైన అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మెరుగైన వైద్యం కోసం రోగులు సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, ఖమ్మం వంటి నగరాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆధునిక ఐసీయూ సేవల ద్వారా అత్యవసర విభాగంలో కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ పరిధిలోనే అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య వసతులు కల్పించే దిశగా ఆసుపత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.



# వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్

**కొత్తగూడెం లీగల్, ఆగస్టు 21 ప్రభాతవార్త**

ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగ హేమచంద్రపురం గ్రామంలోని అమ్మానాథాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు న్యాయ అవగాహన కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఎం.రాజేందర్ మాట్లాడుతూ... సీనియర్ సిటిజన్స్ సమాజానికి అందించిన సేవలు, అనుభవం ఎంతో విలువైనవని అన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని తెలిపారు. వృద్ధుల సంరక్షణ, భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం చట్టపరమైన రక్షణలు ఉన్నాయని, అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. డీఎంహెచ్ఓ డా. తుకారామ్ రాథోడ్ మాట్లాడుతూ... వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, కంటి చూపు, రక్తపోటు, మధుమేహం తదితర ఆరోగ్య సమస్యలను నిరక్ష్యం చేయకూడదని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. వైద్య శిబిరంలో సీనియర్ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు మరియు తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దీపిక, తిరుమలరావు, స్వప్న శ్రావణి, లక్ష్మి, దేవా ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, న్యాయవాది మెండు రాజమల్లు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షులు సుధాకర్ రావు, అమ్మానాథాశ్రమం నిర్వాహకులు హిమ తేజ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో టీచర్ల మౌన ప్రదర్శన

## ఉపాధ్యాయులంటే గౌరవం లేకుండా పోయింది

## రూపా రెడ్డి మృతి పట్ల సంతాపం

**సత్తుపల్లి ఆగస్టు 21 ప్రభాతవార్త**




విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు గౌరవం, భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు ప్రైవేట్ పాఠశాలలయాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, టీచర్స్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లా నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ శుక్రవారం సత్తుపల్లిలో మోనప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా సంతాప సభ నిర్వహించి రూపారెడ్డి మృతికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మోన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మహమ్మద్ రేహానా కమల్ పాష, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ లు మాట్లాడుతూ విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లను గమనిస్తూ వారిలో నైతిక, మానవీయ విలువలను పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకుసురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు పాఠశాలలయాజమాన్యాలు కృషి చేయాలని కోరారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు, సంఘ జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం తగ్గిపోవడం ఆందోళన కరమన్నారు. పదో తరగతి వయసులోనే ఒక ఉపాధ్యాయుడిని హత్య చేయాలనే ఆలోచన ఆ విద్యార్థులకు కలగడం అత్యంతబాధాకరమన్నారు. "పెన్ను, పుస్తకం పట్టాల్సిన చేతుల్లోకి కత్తులు ఎందుకు వస్తున్నాయి?" అని వారు ప్రశ్నించారు. పదో తరగతి అనేది విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ వయసులో వారు తమ భవిష్యత్తు, చదువులు, ఉద్యోగాల గురించి కలలు కనాల్సింది పోయి హింసాత్మక ఆలోచనలకు లోనవడం సమాజానికి హెచ్చరిక వంటిదన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యత, గురువుల పట్ల గౌరవం పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కేపీఆర్ స్కూల్‌మందపాటిప్రభాకర్‌రెడ్డి, కిరణ్, చైతన్య స్కూల్ మురళి, టాలెంట్ స్కూల్ శ్రీనివాసరావు, వాణి విద్యాలయం వంశీ, శాంతినికేతన్ అనిల్, త్రివేణి స్కూల్ వంశీ, గీతాంజలి శ్రీనివాసరావు, నారాయణ, రామమూర్తి, శంకర్, మారేష్ , జ్యోతి నిలయం, కల్లూరు లిటిల్ ఫ్లవర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 6వ బెటాలియన్ ఎన్యూవల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త**

6వ బెటాలియన్ చాతకొండ, భద్రాద్రి కొత్తగూడెం నందు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 మూడవ రోజు ఉత్కంఠ భరితంగా బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి.రమణ ఆధ్వర్యంలో జరిగాయి. రెండవ రోజు జరిగిన క్రీడా పోటీల విభాగాలలో బెటాలియన్ పోలీసు సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొని, హై జంప్, 4!!100,4!!400 రిలే పరుగు పందెం , వాలీ బాల్ జంప్ తదిదర విభాగాలలో తమ తమ సత్తా చాటినారు. ఈ కార్యక్రమంలో లో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ లు హెచ్.అబ్దుల్ రషీద్ , బి.మరియధాసు, ఎ.వి.రమణయ్య , ఏ.ఓ సత్యవతి, ఆర్.ఐ లు, ఆర్.ఎస్. ఐ లు , బెటాలియన్ మినిస్టీరియల్ స్టాఫ్, బెటాలియన్ యూనిట్ హాస్పిటల్ స్టాఫ్, బెటాలియన్ పోలీసు సిబ్బంది , కుటుంబసభ్యులు మరియు బెటాలియన్ లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.



# వారం రోజుల్లోగా భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త**





సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం, కారుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న భూ సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, భూముల వివరాలు, సర్వే పురోగతి, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హేమచంద్రపురం, కారుకొండ గ్రామాల పరిధిలో సుమారు 191.25 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా, సుమారు 7.50 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూ సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్‌కు, ఇప్పటివరకు సుమారు 6 ఎకరాల మేర భూ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూములకు సంబంధించిన సర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సర్వే పనులను ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకొని పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. వారం రోజుల్లోగా మొత్తం భూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే పనుల పురోగతిని ప్రతి రోజూ సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. భూ సర్వేకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. భూ సర్వే ప్రక్రియకు సహకరించాలని, అధికారులు నిర్వహించే సర్వే సమయంలో అవసర మైన సమాచారం అందించాలని రైతులను కోరారు. ప్రాజెక్టు పనుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భూసేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు సంబంధించిన పనుల్లో భూసేకరణ, భూ సర్వే కీలకమైన అంశాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వ యం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, సర్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఇంటింటా వరలక్ష్మీ వ్రతం.. ఆలయాల్లో భక్తుల సందడి

## అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

## ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ..

## ముత్తైదువులకు వాయనాలు

## శ్రావణ శోభ.. వరలక్ష్మీ వ్రతంతో కళకళలాడిన ఆలయాలు





**ఖమ్మం, ఆగస్టు 21 (ప్రభాతవార్త కల్చరల్):**

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఖమ్మం నగరంలోని వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరాలు ప్రసాదించే వరలక్ష్మీదేవిని కొలుస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. ఉదయం నుంచే ఆలయా లకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరా వడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

### ఇంటింటా భక్తి సందడి..

శ్రావణమాసంలో అత్యంత విశిష్టమైనదిగా భావించే వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు తమ ఇళ్లలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలు, చిత్ర పటాలను పూలతో అందంగా అలంకరించి ప్రత్యే క పూజలు చేశారు. కుటుంబ సభ్యులకు సుఖ శాంతులు, ఆయురా రోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ అమ్మవారిని ప్రార్థించారు.

### ఆలయాల్లో పోటెత్తిన భక్తులు..

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నగరంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా సామగ్రితో వచ్చిన మహిళలతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. భక్తుల రాకతో దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

### అష్టలక్ష్మీ స్వరూపిణిగా వరలక్ష్మి..

హిందూ సంప్రదాయం ప్రకారం శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. వరలక్ష్మీదేవిని అష్టలక్ష్మి స్వరూపిణిగా భావిస్తారు. ఈ రోజున అమ్మవారిని పూజిస్తే అష్టలక్ష్ములను పూజించిన ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

### సౌభాగ్యం కోసం ప్రత్యేక పూజలు..

వివాహిత మహిళలు తమ భర్త, పిల్లల క్షేమం, కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం వ్రతాన్ని ఆచరించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నైవేద్యాలతో అమ్మవారిని పూజించారు. పూజ అనంతరం ముత్తైదువులను ఆహ్వానించి పసుపు, కుంకుమ, తాంబూలం, వాయనం అందజేశారు.

### కలశ స్థాపనతో పూజలు..

ఇళ్లలో అమ్మవారి ప్రతిమ లేదా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పవిత్రమైన కలశాన్ని స్థాపించి పూజలు నిర్వహించారు. తొమ్మిది పోగుల పసుపు దారాన్ని కంకణంగా కుడిచేతికి ధరించారు. భక్ష్యాలు, పూర్ణాలు తదితర పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. చీర, జాకెట్, గాజులు తదితరాలను అమ్మవారికి సమర్పించి ఆశీర్వాదం పొందారు.

# ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిలో సివికే సేవలు చిరస్మరణీయం



## రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి

## ఘనంగా 5వ వర్ధంతి

**చర్ల, ఆగస్టు 21:(ప్రభాతవార్త)**

సమాజ శ్రేయస్సు, ప్రజా సంక్షేమమే జీవిత ధ్యేయంగా చేసుకుని తొమ్మిది దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన మహనీయుడు సీవీకే రావు అని తెలంగాణ రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్ రెడ్డి కొనియాడారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. రైస్‌పేట శైలజా విహార్ ప్రాంగణంలో శుక్రవారం 5వ వర్ధంతి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తేరా రజనీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మొదట రాళ్ళగూడెం లోని 'త్యాగీస్థల్' వద్ద ఉన్న సీవీకే ఘాట్‌ను సందర్శించి నివాళు అర్పించారు. ప్రజాసేవా ప్రస్థానం గురించి తెలుసుకుంటే ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో అర్థమవుతుందని అన్నారు. రవాణా సౌకర్యాలు సైతం సరిగా లేని సమయంలోనే ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని నాటి ముఖ్యమంత్రులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన దూరదృష్టి గల నాయకుడు అని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తూ జీవితాన్ని కొనసాగించిన సీవీకే రావు నేటి తరానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. తండ్రి సేవా వారసత్వాన్ని ఆయన తనయులు సీవీ రమణ, సీవీ సతీష్ లు కొనసాగించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఎంఎల్ ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓ, సీనియర్ ఐఏఎస్ అధికారి జే. భవానీ శంకర్ సీవీకే సేవలను స్మరించుకున్నారు. ఏజెన్సీ ప్రాంత రూపురేఖలు మారడంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంలో సీవీకే రావు పోషించిన నాయకత్వ పాత్ర ఎనలేనిదని వారు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు ఏజెన్సీ ప్రాంత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతాయని అన్నారు. ఈ సంస్మరణ సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సీవీకే అభిమానులు, గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీవీకే రావు చిత్రపటానికి, విగ్రహానికి నివాళులర్పించి ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఆయన చేసిన ప్రజాసేవను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు పిసిసి సభ్యుడు నల్లపు దుర్గా ప్రసాద్ గ కాంగ్రెస్ నాయకులు, పుర ప్రముఖులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# దొంగ అరెస్ట్

## చోరీ చేసిన 2.10 లక్షల విలువైన బంగారం స్వాధీనం

## బస్టాండ్ వద్ద పట్టుకున్నామని సీఐ ప్రకటన



**తల్లాడ ఆగస్టు 21 ప్రభాతవార్త**

ఇంటికి తాళాలు వేసి ఉన్న గృహాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్థుని పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టుకొని అతని వద్ద రెండు లక్షల పదివేల విలువ చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వైరా సీఐ ఎన్ వెంకటకృష్ణ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు ఇటీవల గంగాదేవి పాడు గ్ర్రామ లో సిలువేరు నరసింహారావు వ్యక్తిగత పనిమీద వేరే గ్రామం వెళ్లగా భార్య వ్యవసాయ పనులకు వెళ్ళగా దొంగ ఇంట్లో బీరువా తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డాడు దీంతో పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు అలాగే తల్లాడ లో కూడా తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకొని చోరీకి పాల్పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు శుక్రవారం ఉదయం 7:30 గంటల సమయంలో బస్టాండ్ వద్దపాత నేరస్తుడైన జంగాల స్వరూప్ కుమార్ ఎలియాస్ శాంతి స్వరూప్ అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు చేసింది తానేనని ఒప్పుకొని ఎస్సా ర్ జ్యువెలరీలో విక్రయాలు జరిపినట్లు ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు దాదాపు నిందితుడు నుంచి రెండు లక్షల పదివేల విలువచేసే బంగారాన్ని స్వాధీన

# రెండు బోర్లు ఎండిపోయి..

## రైతు ఆశలు ఆవిరిరూ.లక్ష పెట్టుబడి..

## కళ్లముందే ఎండిన వరి

## పశువులకు మేతగా వదిలేసిన రైతు...

## ఆదుకోవాలని వేడుకోలు



**రాజాపేట, ఆగస్టు 21 ప్రభాతవా**

వానాకాలం వర్షాలపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. బోర్లను నమ్ముకుని వరి సాగు చేసిన రైతుకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన బాల్ద నరసయ్య తనకున్న మూడు ఎకరాల భూమిలో రెండు బోర్ల నీటిపై ఆధారపడి ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశాడు. పంట సాగు కోసం సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి రెండు బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. బోర్లలో నీరు లేకపోవడంతో వరి పంటకు సాగునీరు అందించలేకపోయాడు. కళ్లముందే పచ్చగా ఉండాల్సి న పైరు క్రమంగా ఎండిపోయి, చివరకు పూర్తిగా దెబ్బతింది. చేసేదేమీ లేక ఎండిపోయిన వరి చేనును పశువులకు మేతగా వదిలేయాల్సి న దుస్థితి ఏర్పడింది. మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. రెండు బోర్లను నమ్ముకుని రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. వర్షాలు కురిస్తే పంట చేతికి వస్తుందని



ఆశపడ్డాను. కానీ వానలు లేక రెండు బోర్లు ఎండిపోయాయి. పంటకు నీరు అందక మొత్తం ఎండిపోయింది. చివరకు పశువులకు మేతగా వదిలేయాల్సి వచ్చింది. పెట్టిన పెట్టుబడి మొత్తం పోయింది. ప్రభుత్వం పంట నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాల్సి అని రైతు నరసయ్య కన్నీటిపర్యంతమయ్యాడు.

# వసతి గృహంలో ఉచిత వైద్య శిబిరం



**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 21:**

మండల పరిధిలోని లంకమల్లారం గిరిజన బాలికల గురుకుల వసతి గృహాన్ని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉమాదేవి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం తీసుకోవడం, తడి బట్టలు ధరించకపోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత వసతి గృహంలోని వంటశాలను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి. పరంగిణీ, హెల్త్ అసిస్టెంట్లు రాం ప్రసాద్, కృష్ణ, ఏఎన్ఎమ్ సుమ, ఆశా కార్యకర్త శైలజ తదితరులు పాల్గొన్నారు.

# బర్లగూడెం లో ముమ్మరంగా క్లోరినేషన్

## దోమల నివారణకు ఫాగింగ్



**కామేపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో సర్పంచ్ మాలోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ము మ్మరంగా క్లోరినేషన్ నిర్వహించారు. మంచినీటి వనరులను శుద్ధి చేశారు. రహదారులపై నిల్వ నీటిని తొలగించారు. గుంతలను పూడ్చివేశారు. రహదారులకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణకు గాను ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిషన్ నాయక్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య సంరక్షణకు మూలాధార మన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉం టుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మూడు సురేష్, లఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లిలో వరలక్ష్మి వ్రతం



**కామేపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన కామేపల్లి తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వరలక్ష్మి వ్రతం వే డుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో సాం ప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం ను పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతం వేడుకలను మహిళలు నిర్వహించడం జరిగింది. వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, విశేష పూజలను చేశారు. అమ్మవారిని ఇళ్లల్లో సుందరంగా అలంకరించి పూజలు చేసి కుటుంబ క్షేమాన్ని కాంక్షించారు. కామేపల్లిలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతం వేడుకల్లో కేశ గాని కనక లక్ష్మి, గాదె జ్యోతి, గాదె పద్మ తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.




# మణుగూరు బాలల సదనంలో వసతుల ఏర్పాటు



**మణుగూరు, ప్రభాతవార్త ఆగస్టు 21:**

మణుగూరులోని బాలల సదనం పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను తక్షణమే కల్పించినట్లు శుక్రవారం భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రునాల్ శ్రేష్ట తెలిపారు. ఈ నెల 21న నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో బాలల సదనంలో సరిపడా డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు లేవని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రంలోగా వీటిని సమకూర్చడంతో పాటు పిల్లలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేయాలని మణుగూరు తహసీల్దార్ నరేష్‌ను ఆదేశించినట్లు చెప్పారు. అధికారుల వేగవంతమైన స్పందనతో సాయంత్రానికే వసతులు అందుబాటులోకి వచ్చాయని, తక్షణమే స్పందించిన తహసీల్దార్ బృందాన్ని సబ్ కలెక్టర్ అభినందించారు. మణుగూరు డివిజన్ పరిధిలోని పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలపై అధికారులు ఇదే తరహా చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ ఆకస్మిక తనిఖీలో సదనంలో సరిపడా డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు లేవని గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రంలోగా వీటిని సమకూర్చడంతో పాటు పిల్లలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేయాలని మణుగూరు తహసీల్దార్ నరేష్‌ను ఆదేశించినట్లు చెప్పారు. అధికారుల వేగవంతమైన స్పందనతో సాయంత్రానికే వసతులు అందుబాటులోకి వచ్చాయని, తక్షణమే స్పందించిన తహసీల్దార్ బృందాన్ని సబ్ కలెక్టర్ అభినందించారు. డివిజన్ పరిధిలోని పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలపై అధికారులు ఇదే తరహా చొరవ చూపాలని ఆయన కోరారు.

# ఆర్థిక సాయం

**మణుగూరు, ప్రభాతవార్త, ఆగస్టు 21:**



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా ఐటిఐ అప్రెంటిస్ రవి కిషోర్‌కు పీకే ఓసీ 2 డంపర్ మెయింటెనెన్స్ విభాగం ఉద్యోగులు రూ. 25,000 ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఆర్థిక సాయాన్ని విభాగాధిపతి మనోహర్ బాధితుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న సహోద్యోగి కుటుంబానికి అండగా నిలవడం అందరి బాధ్యత అని, రవి కిషోర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాధితుని కుటుంబ సభ్యులు ఉద్యోగుల సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ, రామకృష్ణ, షేక్ అబ్దుల్ రవూఫ్, మేకల ఈశ్వర్ రావు, జీవరత్నం, దీపక్, నవీన్, వెంకటేశ్వర రావు, శాంతి కుమార్, ప్రసాద్, నర్సి ంహారావు, వెంకటేశ్వరరావు, మన్సూ ర్ అలీ, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వానల కోసం నీటి బిందెలతో బతుకమ్మ ఆట

**రాజాపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త**

వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని దూది వెంకటాపురం గ్రామ మహిళలు శుక్రవారం వినూత్నంగా బతుకమ్మ ఆడారు. నీటి బిందెలను పెట్టి బతుకమ్మ పాటలు పాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాలు సకాలంలో కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలకు సాగునీరు అందాలని ఆకాంక్షిస్తూ మహిళలు సామూహికంగా బతుకమ్మ ఆడారు. నీటి కొరత తొలగి గ్రామంలో పాడిపంటలు కళకళలాడాలని వేడుకున్నారు. వానల కోసం బతుకమ్మ ఆడిన మహిళలు అనే ఈ వినూత్న కార్యక్రమం స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది.

# కీర్తించుకోవడానికే మంత్రుల సభ

పదిశాతం రోడ్డు పూర్తి చేయకుండా అభివృద్ధి అనడం సిగ్గు చేటు

మూడేళ్లలో కూల్చివేతలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదు

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని ప్రభాతవార్త:



ఈ ప్రాంత ప్రజల ముందు తనను కీర్తించుకోవాలనే ఉద్దేశ్యంతోనే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ మంథని కి మంత్రులను తీసుకువచ్చి కోట్ల రూపాయాలను వృదా చేశాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న క్రమంలో ఎనిమిదిసార్లు ఒకే కుటుంబానికి ఓట్లు వేసి గెలిపించారని అదేవిదంగా ఒకే వ్యక్తికి ఐదుసార్లు అవకాశం కల్పించినఈ ప్రాంత ప్రజలకు అన్యాయం, అపకీర్తి తీసుక వచ్చాడని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు దగ్గరికి వస్తున్నా ఇంకా అబద్దాలపైనే జీవిస్తున్నాడని, ఇది ప్రజాస్వామ్యానికే అవమానమన్నారు. మంథని నియోజకవర్గ ప్రజల కోసం ఒక్కశాతం ఆలోచన చేయకుండా కేవలం తనను కీర్తించుకోవడానికే మంత్రులను తీసుకువచ్చి అభివృద్ధి పనుల పేరిట శిలాఫలకాలు వేశారని ఆయన విమర్శించారు. మంథనికి న్యాక్ సెంటర్‌కు ఫౌండేషన్ వేస్తున్నం, జీఓ తీసుకువచ్చినం అని చెప్పితే 20ఏండ్ల క్రితమే జీవన్‌రెడ్డి తీసుకువచ్చాడని, ఇక్కడికి ఆలస్యంగా తీసుకువచ్చావన్నారు. అంతేకాకుండా అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ నిధులను చూపిస్తున్నాడని, మంత్రి స్వగ్రామమైన దన్వాడ పక్కనే ఉన్న దేవరాంపల్లి వద్ద రోడ్డు పూర్తి కాక దుమ్ము దూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యానికి గురవుతున్నామని, రోడ్డు బాగు చేయాలని ప్రజలు కోరినా పట్టించుకోకుండా మళ్లీ డీఎంఎఫ్‌టీ నిధులతో మంథనిలో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాము పెద్దపల్లి కాటారం వరకు రోడ్డు నిర్మాణం కోసం డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరీ చేశామని, 90శాతం రోడ్డు పనులు పూర్తి కాగా కేవలం 10శాతం మిగిలిపోతే కనీసం ఆ మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయించలేదన్నారు. ముఖ్యమంత్రికి ఏం చెప్పాలన్నా దుద్దిళ్ల శ్రీధర్ ద్వారానే చెప్తామని, ముఖ్యమంత్రికి దుద్దిళ్ల శ్రీధర్ అనుసంధాన కర్త అంటూ తుమ్మల నాగేశ్వర్‌రావు గొప్పగా చెప్తున్నాడని, అంతలా కీర్తంచబడే మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉండగా అలాంటి ఆలోచనలు చేయకుండా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కూల్చివేతలు మొదలు పెడితే ఇక్కడ శ్రీధర్ బాబు మొదలు పెట్టాడని అన్నారు. 2024లో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రితో కలిసి అనేక అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారని ఇప్పటికీ అందులో ఏ ఒక్కటి మొదలు కాలేదని, పనులు ఎందుకు మొదలు పెట్టలేదో జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యువత ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు యువతలో చైతన్యం తీసుకురావాలని, మనం చైతన్యం కాకపోతే ఇంకా ఇలాగే మోసం చేస్తూనే పోతాడని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితునికి రూ.2.50 లక్షల ఎల్ఓసి అందజేత

ముత్తారం, ఆగస్టు 21, ప్రభాతవార్త:



ముత్తారం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన రామగాళ్ల పెద్ద రాజయ్య అనారోగ్యంతో బాధ పడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా సి ఎం ఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో రూ.2.50లక్షల ఎల్‌ఓసి మంజూరు అయ్యింది. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో పెద్ద రాజయ్య కుటుంబ సభ్యునికి ఈ ఎల్ ఓ సిని మంత్రి నిమ్స్ ఆసుపత్రి సహాయకుడు అందజేశారు. ఎల్ ఓ సి మంజూరు చేయించిన మంత్రికి ఈ సందర్భంగా పెద్ద రాజయ్య, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వయోవృద్దుల సంరక్షణ భాధ్యత వారసులదే




ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది

**మంథని ప్రభాతవార్త:** వయో వృద్దుల సంరక్షణ బాధ్యత మొద్దని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ అపర్ణ మల్లాది అన్నారు. శుక్రవారంప్రపంచ వయోవృద్దుల దినోత్సవ సందర్భంగా మంథని కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమ బాధ్యత వారి వారసులదేనని, వృద్ధుల సంక్షేమ చట్టం క్రింద రెవెన్యూ డివిజన్ అధికారి కేసుల విచారణ జరిపి ఉత్తర్వులను జారీ చేస్తారని ,ఉల్లంఘన జరిగిన పక్షంలో కోర్టులు గరిష్ఠంగా మూడునెలల జైలు శిక్ష, రూ.5వేల వరకు జరిమాన విధించవచ్చని పేర్కొన్నారు,సీనియర్ న్యాయ వాదులు కె రఘోతం రెడ్డి, సువర్ణ చంద్రశేఖర్ చట్టం పట్ల అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ,సింగరేణి కార్మికుల పెన్షనర్ అసోషియేషన్ సభ్యులు,న్యాయ వాదులు కటకం శ్రీనివాస్,సదన్ కుమార్,శశిభూషణ్ కాచె పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్

రామగిరి ప్రభాతవార్త:

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ అన్నారు. శుక్రవారం రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు జంగిలి స్వప్న రాజేంధర్ కుటుంబ సభ్యులతో కలిసి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశార.ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు



అందించడమే లక్ష ్యంగా ముందుకు వెళ్తుందని, సొంత ఇంట్లో సగర్వంగా జీవించాలన్నదే ఇందిరమ్మ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ల అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, రొడ్డ బాపు , ఒర్రె సదయ్య తో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీవ ఎరువులతో నేల నాణ్యత పెరుగుతుంది

ఏవో డాక్టర్ నవ్య

**మంథని రూరల్ ప్రభాతవార్త:** జీవ ఎరువుల వినియోగంతో నేను నాణ్యత పెరగడంతో పాటు పంటల దిగుబడి అధికంగా ఉంటుందని మంథని వ్యవసాయ శాఖ ఏవో డాక్టర్ నవ్య అన్నారు. శుక్రవారంమంథని మండలం సూరయ్య పల్లి రైతు వేదికలో రైతులకు జీవ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణహితమైన పద్ధతులను పాటించాల్సిన అవసరాన్ని రైతులకు వివరించారు. ట్రైకోడెర్మా, వేపనూనె, అజోల్లా వంటి జీవ ఆధారిత ఉత్పత్తుల ఉపయోగాలు, ప్రయోజనాలను వివరించారు. పి ఎస్ బి ద్వారా నేలలో అందుబాటులో లేని భాస్వరం మొక్కలకు అందుబాటులోకి వస్తుందని, ట్రైకోడెర్మా ద్వారా నేలలోని కొన్ని శిలీంధ్ర సంబంధిత తెగుళ్లను నియంత్రించడంలో సహాయపడుతుందని తెలిపారు. వేపనూనెను సహజ పురుగుల నియంత్రణలో ఉపయోగించవచ్చని, అజోల్లా ద్వారా నేల సారాన్ని పెంపొందించడంతో పాటు పంటలకు పోషకాలు అందించడంలో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో లక్కేపూర్ సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు

మంథని రూరల్ ప్రభాతవార్త:



మంథని మండలం సూరయ్య పల్లె,మీదుగా కాకర్లపల్లి, రామకృష్ణాపూర్, సీతంపల్లి వరకు రూ. 29.94కోట్లతో రోడ్డుకు నిధులు మంజూరు చేసి పనులకు శంకు స్థాపన చేసి సూరయ్యపల్లి గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర మంత్రి దుద్దిల్ల.శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబులకు సూరయ్యపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఆరెల్లి సూచిత వరుణ్ గౌడ్, కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే మూడు రోడ్లు మంజూరు చేయాలని,రైతులకు రవాణా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కోరడం జరిగిందన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ రోడ్లకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామని ఆయన పేర్కొన్నారు.రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా సూరయ్యపల్లి గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## భక్తులతో పోటెత్తిన మహాలక్ష్మి దేవాలయం

మంథని ప్రభాతవార్త:



శ్రావణ మాసం వచ్చే రెండో శుక్రవారం వరలక్షి ్మ శుక్రవారం పురస్కరిం చుకొని మంథని పట్టణంలోని శ్రీ మహాలక్షి ్మ ఆలయం భక్తులతో కళకళలాడింది. ఉదయం 4 గంటల నుండి భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని పునీతులయ్యారు. ఉదయం నాలుగు గంటలకు అమ్మవారికి అబి. షేకం, 6 గంటలకు అర్చన అనంతరం అమ్మవారిని అలంకరించారు. భక్తుల సౌకర్యం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో శ్రీ వరలక్షీ ్మ వ్రతం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని వ్రత కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన

## రామగిరి మండల కళాకారుల కార్యవర్గం నియామకం

రామగిరి ప్రభాతవార్త:

పెద్దపెల్లి జిల్లాలోని నందన గార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర కళాకారుల వేదిక రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో పెద్దపెల్లి జిల్లా, మరియు అన్ని మండలాల అధ్యక్షుల, ప్రధాన కార్యదర్శుల మరియు కోశాధికారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రామగిరి మండలం కళాకారుల అధ్యక్షులుగా రత్నాపూర్ గ్రామానికి చెందిన వేగోలపు కృష్ణ స్వామి గౌడ్,ప్రధాన కార్యదర్శిగా లద్నాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి కిషోర్ గౌడ్,కోశాధికారిగా పన్నూరు గ్రామానికి చెందిన ఉడుత ముకుందం యాదవ్ ఎన్నికైనట్టు రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి సంపత్ గౌడ్ తెలిపారు.



## ఎరువులు యాప్ ద్వారానే బుకింగ్

పెగడపల్లి, ప్రభాతవార్త:

రైతులకు ఎరువుల సరఫరా, సన్న రకం వరి సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ కీలక సూచనలు చేసింది. ఇకపై ఎరువుల విక్రయ ప్రక్రియను ఫెర్టిలైజర్ యాప్ ద్వారా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు. రైతులు ముందుగా తమ వివరాలను నమోదు చేయించుకుని, యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకున్న అనంతరం వాటిని పొందాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన సన్న రకం వరి రకాలను సాగు చేస్తున్న రైతుల వివరాలను వ్యవసాయ శాఖ నమోదు చేస్తోంది.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా పేట పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు సత్వర న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ వర్టికల్స్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. పేకాట, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీటీఎనఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం సైబర్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్112కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, సీఐ నాగరాజు, ఎసఐలు యయాతి రాజు, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్‌ల రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**దమ్మపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23 అర్ధరాత్రి 12 గంటల నుండి జేఏసీ ఆధ్వర్యంలో జరగబోయే ఆటో క్యాబ్ డ్రైవర్స్ రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ కోరారు. శుక్రవారం దమ్మపేట ఆటో అడ్డా వద్ద జరిగిన సమావేశం లో అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానని ప్రకటించిన రూ.12 వేల రూపాయలు గురించి ప్రభుత్వం ఆలోచించే తీరిక లేదని అన్నారు. ఆటో క్యాబ్ డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు చేయడం దురదృష్టకరమని సంబంధిత అధికారుల దృష్టికి ఆటోకార్మికుల సమస్యలు తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించలేదని గత్యంతరం లేని పరిస్థితిలో నిర్వాదిక సమ్మెకు ఆటో కార్మికులు దిగవలసి వచ్చిందని అన్నారు. మోటార్ రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఓలా ఉబర్ రాపిడో లాంటి సంస్థల వలన ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వమే టీజీ యాప్ తీసుకువచ్చి ఆటో క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన ఆటో కార్మికులకు ఇందరమ్మ ఇల్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు విక్రం, బాలయ్య, వెంకట్, రవి, శ్రీను, బుచ్చిరాజు, రాజశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని పోలీస్‌లు అరెస్టు చేయగా గంజాయి సేవించిన ముగ్గురిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించడానికి కోర్టులో పోలీస్‌లు హాజరు పరిచారు. ఈ మేరకు సదరు వ్యక్తులను మీడియా ముందు శుక్రవారం డిఎస్పీ సతీష్‌కుమార్ హాజరు పర్చి వివరాలు తెలిపారు. మండల పరిధిలోని కొర్స వారి గూడెం గ్రామ శివారులో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అశ్వరావుపేట పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా వారిని భద్రాచలంలోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించవలసిందిగా కోర్టు సూచించింది. వీరికి గంజాయి విక్రయించిన పాపిడిగూడెంకు చెందిన అల్లం వెంకటేశ్వరరావును అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎసఐ యయాతి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు

## పాలగుట్టకు శ్రావణమాస ఆధ్యాత్మిక శోభ

**జూలూరుపాడు, ప్రభాతవార్త, ఆగస్టు 21:**



పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక అలంకరణల మధ్య శ్రీ వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి వేద మంత్రోచ్చారణలతో పూజలు చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు కలశాన్ని అలంకరించి కుంకుమార్చనలు, అష్టోత్తర శతనామావళి పారాయణం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం పరస్పరం వాయనాలు ఇచ్చిపుచ్చుకుని వ్రత విశిష్టతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక దర్శనం చేసుకుని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. దేవాలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పూజల అనంతరం ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా కాకర్ల గ్రామ సమీపంలోని పాలగుట్టపై కొలువుదీరి ఉన్న శ్రీ రుక్మిణి సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంతో పాటు దైవ కల్యాణానికి మహిళలు భక్తులు, పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో పాలగుట్టకు శ్రావణమాస, వరలక్ష్మీ వ్రత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ ఢిల్లీ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# ఘనంగా వరలక్ష్మి వ్రత మహోత్సవం

**కల్లూరు, ఆగస్టు 21, ప్రభాతవార్త**



శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత వైభవంగా కల్లూరు మండలంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వేకువ జామున లేచి ప్రత్యేక పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు. మహాలక్ష్మి అమ్మవారికి పూజలు జరిపారు. కల్లూరు లోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం , ఎన్ ఎస్ పి లోని శ్రీ మారమ్మ తల్లి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇళ్ల సర్వేలతో లబ్ధిదారులను గందరగోళపర్చొద్దు

## వెన్నెల నగర్‌లో మిగిలిన 500 మందికి ఒకేసారి ఇళ్లు మంజూరు చేయాలి: జలాల్

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**



ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక పేరుతో ప్రభుత్వం పదేపదే సర్వేలు నిర్వహిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరికాదని సేవ్ కొత్తగూడెం-సేవ్ కార్పొరేషన్ కన్వీనర్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి జలాల్ అన్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయి, వారిని ఎల్1, ఎల్2, ఎల్3 విభాగాలుగా విభజించిన నేపథ్యంలో మళ్లీ సర్వేల పేరుతో కాలయాపన చేయడం ఎందుకని ప్రశ్నించారు. మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా, రెండో విడతపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సర్వేల పేరుతో లబ్ధిదారులను తికమక పెట్టకుండా, ఇప్పటికే ఉన్న వివరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా వెన్నెల నగర్‌లో మిగిలి ఉన్న సుమారు 500 మంది లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇచ్చి, ఒకే విడతలో ఇళ్లు మంజూరు చేయాలని జలాల్ కోరారు. అర్హులైన పేదలకు సొంతింటి కలను నెరవేర్చడంలో ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**పాల్వంచ, ఆగస్టు 21, ప్రభాత వార్త:**

పాల్వంచ టౌన్ పోలీసుల అప్రమత్తతతో అక్రమంగా తరలిస్తున్న సుమారు 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఆగస్టు 15వ తేదీ ఉదయం సుమారు 5 గంటల సమయంలో పాల్వంచ టౌన్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అల్లూరి సెంటర్‌లోని రామాంజనేయ రైస్ మిల్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న TS 05 UC 1889 నంబర్ లారీని తనిఖీ చేశారు. లారీలో 620 బస్తాల్లో సుమారు 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ ఎస్.కె. ఖాజా మొయినుద్దీన్ (వల్లాపురం గ్రామం, నిడిగూడ మండలం, సూర్యాపేట జిల్లా)ను విచారించగా, బియ్యం రవాణాకు సంబంధించిన ఎటువంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేదా అనుమతులు చూపలేకపోయాడు. దీంతో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తులో ఈ వ్యవహారంలో రామాంజనేయ రైస్ మిల్ యజమాని నరిగే రవీంద్ర, పాల్వంచ బ్రోకర్ కొండ్లే వెంకటేశ్వరరావు, మిర్యాలగూడ బ్రోకర్ విదియాల శ్రీను, ధీరజ్ రైస్ మిల్స్ కు చెందిన నూతక్కి వాసు, లారీ యజమాని ఎస్.కె. పాషా, లారీ యజమాని ఏజెంట్ అనోదు సుధాకర్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న లారీ, డ్రైవర్‌తో పాటు పీడీఎస్ బియ్యాన్ని పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి భద్రపరిచారు. ఘటనపై జిల్లా పౌర సరఫరాల అధికారికి సమాచారం అందించగా, వారి నివేదిక అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



# మోటారు ఆటో మెకానిక్ వర్కర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

సత్తుపల్లి ఆగస్టు 21 ప్రభాతవార్త

సత్తుపల్లిలోని చేయూత మోటారు ఆటో మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా ఎస్.కే. నజ్మొద్దీన్, సుభాని ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా టి. సురేష్, క్రాంతికుమార్, గణేష్, రహంతుల్లా, మహ్మద్ రఫీ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శంకరాచారి ఎన్నిక కాగా, ఎస్.కే. ఉస్మాన్, షరీఫ్, సుభాని, వీరభద్రరావు ,జె.అబీయుల్లాలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం. ఏడుకొండలు మాట్లాడుతూ ఆటో మెకానిక్ వర్కర్ల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మెకానిక్ వర్కర్లు తమ వృత్తిని సౌకర్యవంతంగా నిర్వహించుకునేందుకు సత్తుపల్లిలో ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ సభ్యుల సమస్యలను సంబంధిత అధికారుల




దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆటోనగర్ ఏర్పాటుకు వినతి.....సత్తుపల్లి పట్టణంలో ఆటో మెకానిక్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాలని కోరుతూ నూతన కార్యవర్గ సభ్యులు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టాదయానంద్విజయకుమార్, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఆటో మెకానిక్ వర్కర్ల సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్కు వెంటనే ఆదేశాలు జారీ చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అనంతరం కలెక్టర్ తహసీల్దార్తో కలిసి ఆటోనగర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటా మని హామీఇచ్చినట్లుపేర్కొన్నారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర, ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులుమట్టాదయానంద్ విజయకుమార్, రెవెన్యూ అధికారులకు చేయూత మోటారు ఆటో మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధితో పాటు మెకానిక్ వర్కర్ల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని అధ్యక్షుడు ఏడుకొండలు తెలిపారు.




## సబ్ కలెక్టర్ ను సన్మానించిన బీసీ సంక్షేమ సంఘం

సత్తుపల్లి ఆగస్టు 21 ప్రభాతవార్త



జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఐఏఎస్ కు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ ఐఏఎస్ అజయ్ యాదవ్ ను శాలువాతో సత్కరించి, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషినిఈసందర్భంగా వారు స్మరించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిపాలనను మరింత పారదర్శకంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాలనిఆకాంక్షి ంచారు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు ఉప్పు హనుమంతు,కల్లూరు టౌన్ అధ్యక్షులు బయ్యారపు నరింద్ర,జిల్లాఉపాధ్యక్షులు మల్లెలశ్రీనివాసరావు, యువజన సంఘంసత్తుపల్లినియోజకవర్గ అధ్యక్షులు కోమటితిరుమల రావుబాలకృష్ణ, బొడ్డ కృష్ణ, షేక్ బాజీ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ వర్గాల చైతన్య శక్తి

### కుమ్మర కుల ఐక్యతా వాది

### కీ శే మొగిలిచర్ల వీరన్న

సత్తుపల్లి ఆగస్టు 21 ప్రభాతవార్త

బీసీ వర్గాల రాజ్యాధికార సాధనకు బీసీ ల సాధికారతకు చైతన్యానికి నిరంతరం కృషి చేసిన గొప్ప బీసీ ఉద్యమకారుడు కుమ్మర కుల ఐక్యతా వాది కీ శే మొగిలిచర్ల వీరన్న అని తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ లీగల్ అడ్వైసర్ హైకోర్టు సీనియర్ న్యాయవాది మలికంటి వెంకన్నలన్నారు. తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర కార్యాలయం హైదరాబాదులో శుక్రవారం కీ శే మొగిలిచర్ల వీరన్న మాజీ అధ్యక్షులు తెలంగాణ కుమ్మర సంఘం 880/2014వీరన్న 6 వ వర్ధంతి వేడుకలు ఆ సంఘం 880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు నేదునూరి కనకయ్య అధ్యక్షతన జరిగాయి. కుమ్మర సామాజిక వర్గం సాధికారిత రాజ్యాధికారంలో కుమ్మర కులస్తుల పాత్ర అనే అంశంపై సదస్సునను నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన నేదునూరి కనకయ్య మాట్లాడుతూ కుమ్మర ఐక్యత సంక్షేమమే లక్ష్యంగా స్వాతంత్ర అనంతరం మొదటి సారి కుమ్మర కుల




వృత్తిదారుల ఆర్థిక వికాసం కోసం సబ్సిడీ రుణాలు కుమ్మర శాలివాహన ఫెడరేషన్ సాధించిన ఘనత మొగిలిచర్ల వీరన్నదే అని వీరన్న కుమ్మర హక్కుల రక్షణకు చేసిన పోరాటాలు రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర ద్వారా కుమ్మర సామాజిక వర్గంలో ఐక్యత చైతన్యం రగిలించారని కుల ఆత్మగౌరవ బావుటాను ఎగరేసిన గొప్ప నాయకుడు ని అన్నారు. కుమ్మర సామాజిక వర్గం హక్కుల రక్షణే లక్ష్యంగా కులస్తుల చైతన్య సామాజిక సేవలో నిరంతరం జీవించి తమ జీవితాన్ని కుమ్మర కులస్తుల సామాజిక ఆర్థిక రాజకీయ వికాసం అంకితం చేసిన గొప్ప సామాజిక సంస్కరణ వాది మొగిలిచర్ల వీరన్న అని కొనియాడారు. తెలంగాణ కుమ్మర సంఘం 880/2014రాష్ట్ర ప్రధానకార్యదర్శి తెలంగాణ రాష్ట్రకుమ్మర ఆత్మగౌరవ భవన్ఉపాధ్యక్షులు కొల్లూరు అనిల్ కుమార్మాట్లాడుతూ బీసీ బహుజన వర్గాల సామాజిక న్యాయంకోసం ఉద్యమించిన ఉద్యమకారుడు వీరన్న అని కుమ్మర కుంటల జీవో అమలుకు కుంటలు కబ్జాలకు గురైనవుడువీరన్న నిర్భారదీక్ష చేసి కుమ్మరి మట్టి లభించే కుంటల మీద హక్కులను రక్షి ంచారు అని గుర్తు చేశారు. మొగిలిచర్ల వీరన్నభౌతికంగా లేకపోయినా వారి ఆశయాలు సాధనకు కుమ్మర సమాజం ఉద్యమించాలి అన్నారు. వీరన్న వర్ధంతి సందర్భంగా సమావేశం స్వర్గీయ మొగిలి చర్ల వీరన్న ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అని రెండు నిమిషాలు సంతాపన్ని ప్రకటించింది. సమావేశములో తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు, కోశాధి కారి, కార్యదర్శులు, మలికంటి సిద్ధయ్యధరినిధర్ శ్యాంసుందర్, నమిలకొండ ప్రభాకర్ , నాంపల్లి శంకర్, మేధావుల విభాగం కన్వీనర్ డాక్టర్వారసవేనివరశురామ్, సంఘం రాష్ట్రప్రచార కార్యదర్శి చక్ర పు త్రిమూర్తులు,ఉద్యోగుల విభాగం కన్వీనర్ ఏం కుమార్ యువత విభాగం అధికారులు కాళ్ళులరం కృష్ణపాధ్యక్షులుకాలులారం శంకర్లదితరులు హాజరై మొగిలిచర్ల వీరన్న కు ఘనంగా నివాళులు అర్పించారు.

## ఈత సరదాకు... యువకుడు మృతి

### సంతోష్ బాబు కుటుంబంతో పాటు

### స్నేహితులు హృదయాల్లో దుఃఖం

అన్నపురెడ్డిపల్లి, ఆగష్టు 21,ప్రభాతవార్త:



ఈత సరదా ఓ కుటుంబాన్ని తీరని దుఃఖంతో ముంచేసింది. ఈతకు వెళ్లిన ఇద్దరి యువకుల్లో... ఒకరు మృతి చెందిన సంఘటన అన్నపురెడ్డిపల్లి మండలంలో శుక్రవారం నెలకొంది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైషేక విజయసింహారెడ్డి. పెంట్లం గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెంట్లం గ్రామానికి చెందిన బొమ్మకంటి అంజయ్య. ఇనపనూరి సంతోష్ బాబు. గ్రామ సమీపంలోని శివరామయ్యకుంట చెరువుకు ఈతకు వెళ్లి. ఈతకొడుతూ ప్రమాదవశాత్తు లోతైన నీటి ప్రాంతానికి వెళ్లి. అకస్మాత్తుగా తాపీ మేస్త్రి ఇనపనూరి సంతోష్ బాబు(38). నీటిలో మునిగిపోయాడని. ఒడ్డుకు చేరుకున్న అంజయ్య ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు. పోలీసులు చెరువు వద్దకు చేరుకొని. నైపుణ్యమున్న ఈతగాళ్లతో చెరువులో గాలించి. మృతదేహాన్ని వెలికి తీశారన్నారని తెలిపారు. సంతోష్ బాబు మృతితో కుటుంబంతో పాటు గ్రామస్తులు. స్నేహితులు హృదయాల్లో దుఃఖ విషాద ఛాయలు అలుముకున్నాయి. సంతోష్ బాబు భవన నిర్మాణ తాపీమేస్త్రి కార్మికుడిగా కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి భార్య. ఇద్దరు పిల్లలు ఉన్నారు.



# పేద కుటుంబాలకు అండగా సీఎం సహాయనిధి

మరిపెడ, ఆగస్టు21, ప్రభాత వార్త:

మరిపెడ మున్సిపల్ కేంద్రంలో లోక్యతండాకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుగులోతు రవి నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్ ఆధ్వర్యంలో లోక్యతండాకు చెందిన పానుగోతు రాజ్యా, పానుగోతు వీర్యలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్యం చేయించుకునే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం ఎంతో



ఊరటనిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, తమకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 13వ వార్డులో కాంగ్రెస్‌కు కొత్త కార్యాలయం

### ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం: హరినాథ్‌బాబు



ప్రభాత వార్త , ఖమ్మం రూరల్ :

ప్రజలకు మరింత చేరువ కావడంతోపాటు 13వ వార్డులో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమం నాయకులు, కార్యకర్తలు, స్థానికుల సందడితో ఉత్సాహంగా సాగింది. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, 13వ వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావుతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బైరు హరినాథ్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. 13వ వార్డులో పార్టీ కార్యాలయం ఏర్పాటు కావడం కార్యకర్తలకు, ప్రజలకు మధ్య మరింత సన్నిహిత సంబంధాలు పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే కేంద్రంగా ఈ కార్యాలయం పనిచేయాలని ఆకాంక్షించారు. వార్డు అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందుకూరి వెంకటనారాయణ, 8వ వార్డు కౌన్సిలర్ తనయుడు సంఘాని వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు గోగుల శ్రీనివాస రావు, బైరు ఉపేందర్ పాల్గొన్నారు. నాయకులు కాసిబోయిన శ్రీనివాసరావు, సోమ సత్యనారాయణ, షేక్ యాసిన్, షేక్ మోలాలి, గంగిశెట్టి కొండలరావు, షేక్ జబ్బార్, షేక్ రజియా హాజరయ్యారు. కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కాసిబోయిన నవీన్, మైనారిటీ యూత్ అధ్యక్షుడు షేక్ అంజద్, యూత్ సెక్రటరీ ఏపూరి సైదులుతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గూడూరుపాడులో కక్షసాధింపులు చెల్లవు: కందాళ

ప్రభాతవార్త, ఖమ్మం రూరల్



గూడూరుపాడు గ్రామంలో రాజకీయ కక్షసాధింపు చర్యలకు తావులేదని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన గ్రామ నాయకులపై జరిగిన దాడి ఘటనను ఖండించారు. గూడూరుపాడు కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మద్ది రామారావు, బట్టు రామారావు ఈ నెల 16వ తేదీ రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి వారిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన బాధితుల నుంచి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. బాధితులతో మాట్లాడి ఘటన జరిగిన తీరును, దాడికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని కందాళ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ రాజకీయ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందని, కక్షసాధింపు చర్యలు, దాడులు ఎవరికీ ఆమోదయోగ్యం కాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గూడూరు పాడులో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, అల్లిక వెంకటేశ్వరరావు, బాణోత్ లక్ష్మణ్ నాయక్, పేరం వెంకటేశ్వర్లు, గుడిబోయిన దరగయ్య, గుడా సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన పాదయాత్రకు మద్దతు

నేలకొండపల్లి ఆగస్టు 21 ప్రభాతవార్త:

టి.డబ్ల్యూ.జె.ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాస్ లైన్ అనుబంధ టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాలు మారినా, రాజులు మారిన జర్నలిస్టుల జీవితాలు మారటం లేదని, పాలకులు స్వప్రయోజనాలు చూసుకుంటారు తప్ప ప్రాణాలకు తెగించి రాత్రి పగలు అనకుండా ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారం కావట్లేదని ఆయన అన్నారు. ఎన్నికలు రాగానే జర్నలిస్టులకు అది ఇస్తాం, ఇది ఇస్తాం అని చెప్పి పబ్బం కడుపుకొని అధికారం రాగానే జర్నలిస్టు సమస్యల్ని పట్టించుకోని పాలకులు ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, వారి పిల్లలకు కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య. తిరగడానికి వాహనం ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం వంటివి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మేధావులు, రైతులు,వ్యవసాయ కూలీలు అండగా ఉండాలని ఆయన చెప్పారు.

## పలువురిని పరామర్శించిన మాజీ శాసనసభ్యుడు కందాళ

నేలకొండపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:



నేలకొండపల్లి మండలం లోని ముజ్జుగూడెం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం గ్రామాలలో శుక్రవారం పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాళ ఉపేందర్ రెడ్డి పర్యటించారు. పలు శుభ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పలువురిని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న నేలకొండపల్లి మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం, పగిడికత్తుల సిద్ధు ను కందాళ ఉపేందర్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, పైనంపల్లి, నాచేపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, తన్నీరు సత్యనారాయణ, కోనాయిగూడెం గ్రామ సర్పంచ్ కోటి సైదారెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు ఎండి వాజిద్, గొలుసు రవి, షేక్. హుస్సేన్, కొండా కనక ప్రసాద్, పగిడికత్తుల రాంబాబు, పలువురు గ్రామ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంపీడీవో యర్రయ్య కు ఘనసన్మానం

నేలకొండపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:



జిల్లాలో ఉత్తమ ఎంపీడీవో గా అవార్డును అందుకున్న ఎంపీడీవో యం.యర్రయ్యను శుక్రవారం పరిషత్ కార్యాలయం నందు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, బెల్లం వాసు లు సన్మానించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ మండల ప్రజలకు సేవలందిస్తూ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అవార్డులు మరెన్నో ఎంపీడీవో యర్రయ్య పొందాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు మండల స్థాయి సమీక్ష సమావేశం

నేలకొండపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:

ఈనెల 22వ తేదీన ఉదయం 10.30 గంటలకు నేలకొండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల స్థాయి సమీక్ష సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యం.యర్రయ్య వెల్లడించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు ఆదేశాల మేరకు ఈ మండల స్థాయి సమీక్ష సమావేశంను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నీటి సంరక్షణ పనులు గురించి చర్చించనున్నట్లు తెలిపారు. పంచాయతీ మౌలిక వసతుల అభివృద్ధి పనుల అమోదం పురోగతి కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. వీధి కుక్కల నియంత్రణ, కోతుల సమస్య, వీధి లైట్లు ఏర్పాటు, పంచాయతీల ఆదాయం ఇతరత్రా 16 వ ఆర్థిక సంఘం గ్రాంట్లు వినియోగం పై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంకు గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నేలకొండపల్లి మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## .ముత్యాలమ్మ విగ్రహ పతిష్ఠకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

### రూ.2లక్షల భారీ విరాళం అందజేత



కూసుమంచి, ఆగస్టు 21 (ప్రభాతవార్త) :

కూసుమంచి మండలం అగ్రహారం గ్రామంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి కందాళ ప్రత్యేక అతిథిగా హాజరై అమ్మవారికి శేషవస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా



కందాళ ఉపేందర్ రెడ్డి ముత్యాలమ్మ ఆలయనిర్మాణానికి భారీ విరాళం రూ. 2లక్షలు అందించారని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. శ్రావణ మాసంలో అమ్మవారి దర్శనం ఎంతో సంతోషాన్ని కలిగించిందని కందాళ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి.



కూసుమంచి, ఆగస్టు 21 (ప్రభాతవార్త) :

గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల పాలిట శాపంగా మారిన తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీఓ నంబర్ 33ను తక్షణమే రద్దు చేయాలని జిల్లా బాధ్యులు గుండా ఉపేందర్ రెడ్డి కోరారు. దానిలో భాగంగా శుక్రవారం కూసుమంచి మండల టీడబ్ల్యుయుఎఫ్ ఇంచార్జ్ కర్ల రామారావు ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డిని కలిసి జీఓ నంబర్ 33 వలన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో భాగస్వామ్యం లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదేవిధంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో న్యాయం చేయలేక పోతున్నామని తెలియజేశారు. జీఓ 33 రద్దు చేసే విధంగా, చర్యలు తీసుకునే విధంగా ప్రతిపక్ష నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు దృష్టికి తీసుక వెళ్లాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఫోరం బాధ్యులు చెరుకుపల్లి వీరయ్య, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, ఐతగాని నవీన్, బానోత్ శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి



రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**నీటిపారుదల ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు పరిహారం, పునరావాస ప్రక్రియలను సత్వరం పూర్తి చేయాలి**

**రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

కొత్తగూడెం, ఆగష్టు 21 ప్రభాతవార్త

జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసం తదితర అంశాలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని అన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ మరియు భూసేకరణ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సరఫరాను పరిశీలించిన కలెక్టర్

కల్లూరు, ఆగష్టు 21, ప్రభాతవార్త

కల్లూరు మండల పరిధిలోని పలు ప్రాంతాలలో కాలువ ద్వారా నీటి సరఫరాను కలెక్టర్ దివాకర్ శుక్రవారం ప్రత్యక్షంగా కాలువ కట్టలపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తెలంగాణ ఆంధ్ర సరిహద్దు వరకు ప్రత్యక్షంగా నేరుగా వెళ్లి పరిశీలించారు మండలంలోని దారుక బంజర్ చిన్న కోరుకొండి, మర్లపాడు, పుణ్య పురం, మేజర్ పాయపూరు వద్ద కల్లూరు లోని కప్పల బంధం రెగ్యులేటర్ వద్ద నేరుగా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నీటిని వృధా చేయవద్దని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తమ సిబ్బంది కి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ శ్రీకాంత్, డి ఈ రాజరత్నాకర్ లతోపాటు, సి ఈ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ జాబితా ప్రక్రియ పై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**

ఖమ్మం ఆగస్టు 21, ప్రభాతవార్త:



జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో మండల, పట్టణ అధ్యక్షులతో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించటానికి టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మండల,పట్టణ అధ్యక్షులను వారి వారి మండల, పట్టణాలలోని అన్ని బూత్ లకు సూపర్ వైజర్ నియమించారని తక్షణమే అధ్యక్షులు అందరు ఈ బాధ్యతలను స్వీకరించి, అన్ని పోలింగ్ బూత్ ల పర్యవేక్షణ విజయవంతంగా నిర్వహించాలని మండల, పట్టణ అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా ఈ నెల 25 వరకు మండల, పట్టణ కమిటీల నియామకం పూర్తి చేయాలని ఈనెల 30 వరకు గ్రామ, వార్డు కమిటీల నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర (బి జె పి) హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీని జాతి వ్యతిరేకి విమర్శించడం అహంభావానికి, నిస్సా హాయతకు నిదర్శనం అని నాడు స్వాతంత్ర్య సముపార్జనకు నడుం బిగించి ముఖ్య పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీని,నాయకులను విమర్శించడం ఆకాశంపై ఉమ్మి వేసిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు, దేశ ప్రజలు బీజేపీ కి వ్యతిరేకంగా రానున్న రోజులలో గుణపాఠం చెబుతారని బీజేపీ నాయకుల తీరు జిల్లా కాంగ్రెస్ కమిటీ పక్షాన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు, ఈ కార్యక్రమంలో టి పి సి సి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్,డాక్టర్ కాపా మురళి కృష్ణ,బొడ్డు బొందయ్య,పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల, పట్టణ అధ్యక్షులు ,ఇంచార్జి లు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి





**డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి**

**పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం, ఆగష్టు 21 ప్రభాతవార్త

పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాకులను కలెక్టర్ పరిశీలించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యతతో చేపట్టడంతో పాటు, ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం వైద్య కళాశాల ప్రధాన భవనాలు, హాస్టల్ భవనాలు, ఆసుపత్రి, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారులు, లైబ్రరీ, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, విద్యార్థుల వసతి తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వసతి, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరుతున్నాయా, ఇంకా ఏవైనా అదనపు వసతులు అవసరమా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని అన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రతి పనికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులను నెల రోజు ల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు, బోధనా సిబ్బంది, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత వైద్య, ఇంజినీరింగ్, నిర్మాణ శాఖల అధికారులు, నర్సింగ్ కళాశాల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.